అంధుల పాఠశాల కోసం విరాళాల సేకరణ

నవతెలంగాణ-నందిపేట్



హైదరాబాద్‌లోని సోచ్(అంధుల పాఠశాల) సంస్థకు సహాయార్థం శ్రీగీత కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థులు విరాళాలు సేకరించినట్టు స్కూల్ కారస్పాండెంట్ కానూరి గంగాసాగర్ తెలిపారు. మొత్తం రూ.67,500 ఫండ్ కలెక్ట్ అవగా.. ఆ ఫండ్‌ను శుక్రవారం నందిపేట్ ఎస్ఐ చిరంజీవి చేతుల మీదుగా సోచ్ సంస్థ వారికి అందజేసినట్టు తెలిపారు. ఎక్కువగా డబ్బులు కలెక్ట్ చేసిన విద్యార్థులకు సర్టిఫికేట్స్, మెడల్స్ అందజేసి అభినందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ గంగా భూషణ్ పాల్గొన్నారు.

ఖాతాలకు లాక్ ఓపెన్

నవతెలంగాణ కథనానికి స్పందించిన అధికారులు

నవతెలంగాణ-రామారెడ్డి

స్పందన

మహిళా సంఘాల రుణాలకు సంబంధించిన డబ్బులు చెల్లించటం లేదని మహిళా సంఘం సభ్యుల ఖాతాలకు లాక్ చేశారని నవ తెలంగాణలో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. రెడ్డిపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో బ్యాంక్ సిబ్బందితో, సంబంధిత అధికారులు చర్చించి మహిళా సంఘం సభ్యుల ఖాతాలను తిరిగి ఓపెన్ చేయించారు. ఖాతాలు ఓపెన్ కావడంతో సంఘ సభ్యులు నవతెలంగాణకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

రాత పరీక్ష లేకుండా ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంల నిరసన దీక్ష
- హాల్‌టికెట్‌లు దహనం చేసి ఆందోళన

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఏఎన్‌ఎంలను రాత పరీక్ష లేకుండానే రెగ్యులరైజ్ చేయాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్, కామారెడ్డిలో శుక్రవారం నిరసనలు చేపట్టారు. నిజామాబాద్‌లో పరీక్ష హాల్‌టికెట్‌లు దహనం చేసి నిరసన వ్యక్తం చేయగా.. కామారెడ్డిలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. నిజామాబాద్‌లో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రాత పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖలో 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న కనీస వేతనం ఇవ్వకుండా ఉద్యోగులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. అన్ని రకాల అర్హతలు ఉన్నప్పటికీ వీరిని రెగ్యులర్ చేయకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. కావున రాత పరీక్ష మినహాయించి రెగ్యులర్ చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు వైద్య ఆరోగ్య కాంట్రాక్ట్ పద్ధతి లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు 24 సంవత్సరాలుగా సమస్యల పరిష్కారానికి వివిధ రూపాలలో ఆందోళన పోరాటాలు నిరవధిక సమ్మెలు చేసిన ప్రభుత్వం నేటికీ రెగ్యులర్ చేయకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాత పరీక్షను రద్దు చేసి తమను రెగ్యూలర్ చేయాలని, లేకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గంగా, జమున, ప్రమీల, విక్టోరియా, సావిత్రి, సుమలత, పద్మ, విజయలక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో రాత పరీక్ష హాల్‌టికెట్‌లను దహనం చేసి నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల, సీఐటీయూ నాయకులు



కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా

కామారెడ్డి : కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి అనంతరం తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకురాలు లక్ష్మి మాట్లాడారు. వైద్య ఆరోగ్య సంఘాల పోరాట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఎన్‌ఎంలు చేపట్టిన 48 గంటల నిరసన లో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు 24 ఏళ్ల నుంచి రెగ్యులర్ కాకపోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సమ్మె సందర్భంగా ఏఎన్ ఎంల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఆ కమిటీ రిపోర్ట్ లేకుండా రాత పరీక్ష తేదీ ప్రకటించడం వెనుకాల ఉన్న అంతర్యమేంటని ప్రశ్నించారు. రాత పరీక్షను వాయిదా వేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కాగా, శిబిరంలోనే రాత్రి నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో రేణుక, సవిత, లక్ష్మి, ఆర్సియా, దీవెన, స్వరూప, మౌనిక, కవిత, సంధ్యారాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

ఉడికీ ఉడకని అన్నం

- మెస్ ధరలు పెరిగినా.. నాణ్యత అంతంతే
- కడుపునొప్పితో విద్యార్థులకు అస్వస్థత
- అధికారుల తనిఖీ వేళ నాణ్యత.. తర్వాత విస్మరణ

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సంకల్పంతో మెస్ చార్జీల ధరలు పెంచింది. మెనూ మార్చింది. దీంతో పాటు ఉన్నత అధికారులను వసతిగృహాల పర్యవేక్షణ ముమ్మరంగా తనిఖీలు నిర్వహింపజేశారు. కానీ అధికారులు వచ్చినప్పుడు మాత్రం మెరుగైన భోజనం రుచికరమైన కూరలతో కూడిన భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారని, తర్వాత షరామామూలే అనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. యధావిధిగా ఉడికీ ఉడకని అన్నం తినాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని విద్యార్థులు వాపోతున్నారు. తాజాగా పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.



పెద్దకొడప్‌గల్‌లోని ఎస్సీ బాలుర వసతిగృహం

వివరాల్లోకి వెళ్తే.. హాస్టల్‌లో గురువారం రాత్రి భోజనం తర్వాత 8వ తరగతి విద్యార్థులు బహదూర్‌సింగ్, జగన్‌కు తీవ్ర కడుపునొప్పి వచ్చింది. దీంతో వారిద్దరిని అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే హాస్టల్‌లో ఉడకని అన్నం తినడంవల్లే ఈ పరిస్థితి వచ్చిందని తెలుస్తోంది. ఎస్సీ బాలుర హాస్టల్‌లో ప్రస్తుతం సుమారు 90కు పైగా విద్యార్థులు ఉంటున్నారు. గురువారం ఉదయం ఉడకని అన్నం పెట్టడంతో విద్యార్థులు తినకుండానే స్కూల్‌కు వెళ్లిపోయారు. తిరిగి రాత్రి కూడా ఉడకని అన్నం పెట్టినట్లు తెలుస్తోంది. రోజూ కూడా విద్యార్థులకు పూర్తిస్థాయిలో కూరలు వండట్లేదని, దీంతో సగం కడుపుతోనే పాఠశాలలకు వెళ్తున్నట్లు సమాచారం. ఈ విషయమై వార్డెన్ రాజేందర్‌ను వివరణ కోరగా రెండు హాస్టళ్ల చూసుకోవడం ఇబ్బందిగా ఉందని, బియ్యం కొత్తవి కావడంతో ఇబ్బంది అవుతోందని తెలిపారు. మరోసారి పునరావృతం కాకుండా చూసుకుంటామని చెప్పారు.

కలెక్టర్ వచ్చిన రోజే మంచి భోజనం తిన్నాము

విద్యార్థుల వాపోత

"గత వారం రోజుల క్రితం జిల్లా కలెక్టర్ గారు మా హాస్టల్ కు వచ్చి భోజనం ఏ విధంగా ఉందో తనిఖీలు చేశారు. కానీ ఆరోజు కలెక్టర్ వస్తున్నారని బయట నుండి బియ్యం తీసుకొచ్చి వంట చేసి పెట్టారు. ఆరోజు రుచికరమైన భోజనం దొరికింది. దాని తర్వాత ఉడికీ ఉడకని బియ్యంతో పప్పు లేని సాంబార్‌తోనే అన్నం పెడుతున్నారు. ఇలా పెట్టడంతోనే గురువారం కొంత మంది విద్యార్థులకు కడుపులో నొప్పి వచ్చింది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం బాన్సువాడకు తీసుకెళ్లారు. అధికారులు వచ్చినప్పుడు చేసే విధంగా ప్రతిరోజు వంట చేసి పెడితే బాటుంగుంది. వసతి గృహాల్లో ఉండేది నిరుపేద పిల్లలని గుర్తించాలని' విద్యార్థులు వాపోతున్నారు.

కులబహిష్కరణ.. దాడి

- రక్షణ కల్పించండి గౌడ కుటుంబం వినతి

నవతెలంగాణ-వర్ని (మోస్రా)

తమకు కులం నుంచి బహిష్కరించారని, ఇదే విషయమై ఫిర్యాదు చేయడంతో కక్ష పెట్టుకొని దాడులకు పాల్పడుతున్నారని, తమకు రక్షణ కల్పించాలని బాధిత గౌడ కుటుంబం కోరింది. మోస్రా మండల కేంద్రానికి చెందిన పంజాల సుభాష్‌గౌడ్-మంగమ్మ దంపతులు శుక్రవారం కలెక్టర్‌కు, సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుటుంబాన్ని గౌడ కులపెద్దలు బొజ్జ నర్సాగౌడ్, బొజ్జ స్వామి గౌడ్, బొజ్జ శ్రీనివాస్ గౌడ్, బాగుల నర్సిగౌడ్, బాగుల స్వామి గౌడ్,బాగుల కృష్ణ గౌడ్, శేఖర్ గౌడ్ కుల బహిష్కరణ చేశారని ఆరోపించారు. లైసెన్స్ విషయంలో తమకు ఇబ్బందులకు గురి చేస్తూ బహిష్కరించారని, అంతే కాకుండా తమ కుటుంబంపై కక్ష కట్టి శుక్రవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయం లో తమ చాయ్ హొటల్ వద్దకు వచ్చి, కలు సీసాల పెట్టెలను పగులగొట్టి తన భర్తపై, కుమారులపై దాడి చేశారని మంగమ్మ ఫిర్యాదు చేశారు. మోస్రా గ్రామంలో ఉంటే చంపేస్తాము అని బెదిరింపులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో వర్ని పోలీస్ స్టేషన్‌లో, బోధన్ అబ్కారి ఎస్ఐ కూడా పిర్యాదు చేసిన పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పుడు తమను మరింత టార్గెట్ చేసి చంపడానికి ఇంటి పైకి వచ్చారని, తమకు ప్రాణ రక్షణ కలిపించాలని ఫిర్యాదులో కోరారు.



పగిలిపోయిన కల్లు సీసాలు

విరివిగా పంట రుణాలు ఇవ్వాలి

- జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో అదనపు కలెక్టర్

నవతెలంగాణ-నిజామబాద్ సిటీ

ఆయా రంగాలకు రుణాల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రత్యేకించి ప్రస్తుత యాసంగి సీజన్లో పంట రుణాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశం జరిగింది. 2024-25 ఖరీఫ్ సీజన్ కు సంబంధించి కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, ప్రస్తుత యాసంగిలో రైతాంగానికి అందించాల్సిన పంట రుణాలు తదితర అంశాలపై ఆయా బ్యాంకుల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ ఏడాది ఖరీఫ్ లో రూ. 2640 కోట్లు పంట రుణాలుగా అందించాలని లక్ష్యం కాగా, రూ. 2285.25 కోట్లు పంపిణీ చేసి 86.56 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందని, పూర్తి స్థాయిలో పంట రుణాల లక్ష్యాన్ని సాధించేందుకు బ్యాంకర్లు అందరూ చొరవ చూపాలన్నారు. యాసంగిలో రూ.1762.74 కోట్ల రుణ పంపిణీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. గత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్ లో రూ. 2437 కోట్ల రుణాలకు గాను రూ. 1801.72 కోట్లు పంపిణీ చేసి 73.94 లక్ష్యాన్ని సాధించారని, రబీ సీజన్లో రూ.1625.20 కోట్లకు గాను రూ.1545.65 కోట్లు పంపిణీ చేసి 95.11 శాతం లక్ష్య సాధన జరిగిందని తెలిపారు. ఆయా రంగాల్లో పలు బ్యాంకులు లక్ష్యానికి అనుగుణంగా రుణాలు అందిస్తుం డగా, మరికొన్ని బ్యాంకులు వెనుకం జలో ఉండిపోతున్నాయని అన్నారు. క్రమం తప్పకుండా సమీక్ష జరుపు తూ, వంద శాతం లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా బ్యాంకులు లేని చోట కొత్త బ్రాంచులను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని బ్యాంకర్లకు హితవు పలికారు.

నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డాక్టర్ భూపతి రెడ్డి లేఖ ద్వారా ప్రతిపాదించిన మేరకు సిరికొండ మండలం చిమన్ పల్లి, ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామాలలో బ్యాంకు శాఖలను ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా పొదుపు సంఘాల సభ్యులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉపాధి కల్పించనున్నట్లు అదనపు కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్.డీ.ఓ పృథ్వీ, డీఆర్డీఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ అశోక్ చవాన్, నాబార్డు ఏజీఎం ప్రవీణ్ కుమార్, మెప్మా పీ.డీ రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

బోనమెత్తిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

- మైసమ్మ తల్లి కరుణించి సీఎంకు హామీ గుర్తు చేయాలంటూ నిరసన



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న సర్వశిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. నిరవధిక సమ్మె నిరసన కార్యక్రమంలో భాగంగా కామరెడ్డి జిల్లాలో మున్సిపల్ కార్యాలయ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరం నుంచి చర్చి ముందు ఉన్న మైసమ్మ ఆలయం వరకు ఉద్యోగులు బోనమెత్తి, పోతురాజు వేషధారణలో తమను రెగ్యులర్ చేయాలని బోనాలును మైసమ్మ తల్లికి సమర్పించారు. మైసమ్మ తల్లి సీఎం రేవంత్ రెడ్డి కి, మంత్రులకు తాము ఎన్నికల్లో మాకు ఇచ్చిన హామీని కలలోకిచ్చి గుర్తుచేయాలని ఉద్యోగులు వేడుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ సీఎం వందరోజుల గ్యారెంటీ ఏమైందని, ఇప్పటికీ సంవత్సరం గడుస్తున్న ప్రభుత్వం తమ గురించి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలనలో ఆడపడుచులు రోడ్లమీద ఎక్కి నిరసన కార్యక్రమాలు చేపడుతున్న న్యాయం జరిగేది ఎప్పుడు అని, ఇదేనా ప్రజాపాలనా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు వాసంతి, నాయకులు రాములు, సంతోష్ రెడ్డి, శైలజ, దామోదర్, వీణ, సాయిలు లావణ్య, శ్రీను, మాధవి, గంగ ప్రసాద్, బన్సీలాల్, దినేష్ లింగం, కృష్ణ, సంధ్య 500 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువులను ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విక్రయించాలి

- జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్



రికార్డులు తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-పిట్లం

రసాయనిక ఎరువులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రవీణ్ ట్రేడర్స్ ఎరువుల దుకాణంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల దుకాణం దారులు రసాయనిక ఎరువుల విక్రయంనకు గాను ప్రత్యేక రిజిస్టర్ కేటాయించి క్రయవిక్రయాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఎరువుల విక్రయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని కమల, ట్రేడర్స్ యజమాని గంగా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన జడ్పీ సీఈవో

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండల కేంద్రంలోని పలు హాస్టల్లో శుక్రవారం జడ్పీ సీఈవో చందర్ నాయక్ సందర్శించారు. హాస్టల్ పరిసర ప్రాంతాలను క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. హాస్టల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని హాస్టల్ నిర్వాహకులను సూచించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నరేష్, ఎంపీవో బళ్లారి హాస్టల్ వార్డెన్ ఉన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న చందర్‌నాయక్

అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- పలు చోట్ల నిరసనలు.. దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బీబీపేట్(కామారెడ్డి)/మద్నూర్

భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌ను అవమానిస్తూ మాట్లాడిన కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షాపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేస్తూ అతనిని మంత్రి పదవి నుంచి తొలగించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్ర హెూం శాఖ మంత్రి మాట్లాడిన మాటలు అంబేద్కర్‌ను ఎగతాళి చేసినట్టు ఉన్నాయని శుక్రవారం బిబిపేట్ మండల కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్, అంబేద్కర్ సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అమిత్ షా చేసిన వాక్యాలు వెనక్కి తీసుకోవాలని, భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆయనను హెూం శాఖ మంత్రి పదవి నుండి చేయాలని శుక్రవారం నిరసనతో పాటు ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బాటాయించడంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలగడంతో బిబిపేట్ ఎస్సై ప్రభాకర్ తన సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న వారిని అరెస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పరకాల రవి, బిబిపేట్ మండల్ లో ఉన్న ఆయా గ్రామాల అంబేద్కర్ సంఘాల అధ్యక్షులు కిరణ్ రాజ్, బెల్లె రాజబాబు, నరేష్, నర్సింలుతో పాటు దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మతో నిరసన చేపట్టిన యూత్ కాంగ్రెస్ నాయకులు

కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

మద్నూర్ : మద్నూర్ మండల యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కేంద్ర హెూం శాఖ మంత్రి అమీషా దిష్టిబొమ్మను దహనం చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు మొదట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుండి ర్యాలీగా మండల కేంద్రంలోని పాత బస్టాండుకు చేరుకొని పాత బస్టాండ్ సమీపంలో రహదారిపై బైఠాయించి హెూం మంత్రికి వ్యతిరేకంగా భారీ నినాదాలు చేస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పట్ల పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన దేశ హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకొని వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి పదవికి రాజీనామా చేయాలని మోడీ వెంటనే మంత్రి వర్గం నుంచి అమీషాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్నూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హనుమంత్ యాదవ్, జుక్కల్ నియోజకవర్గం అధ్యక్షులు ఇమ్రోజ్ , డిస్ట్రిక్ట్ కామారెడ్డి జిల్లా వాయిస్ ప్రసిడెంట్ యోగేశ్, జనరల్ సెక్రెటరీ బాలు షిండే, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు పూలమాల

తాడ్వాయి : మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపినట్టు అధ్యక్షుడు గైనిరాజలింగం శుక్రవారం తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాతపై అనుచిత వాక్యాలు చేయడం సరికాదని బెశరత్‌గా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసన శేశారని తెలిపారు. కార్యక్రమంలో చిట్యాల సాయన్న, రమేష్, బాలయ్య, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



బీబీపేట్‌లో రాస్తారోకో చేపట్టిన నాయకులను చెదరగొడుతున్న పోలీసులు



తాడ్వాయిలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన

హెల్మెట్ దారణ.. ప్రాణానికి రక్షణ

- విద్యార్థులతో పువ్వులిపిస్తూ వాహనదారులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి

హెల్మెట్ దారణ.. ప్రాణానికి రక్షణ అని, ద్విచక్రవాహనదారులు తప్ప కుండా హెల్మెట్ ధరించాలని విద్యార్థులు, పోలీసులు సూచించారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో, నిజాంసాగర్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ ఎస్ఐ మహేష్, సిబ్బందితో కలిసి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సహకారంతో హెల్మెట్ వాడకంపై వాహనదారులకు పలు సూచనలు చేశారు. చిన్నపిల్లలతో హెల్మెట్ పెట్టుకోవాలని సూచించే విధంగా గులాబీ పువ్వులను ఇస్తూ, హెల్మెట్ పెట్టుకోవాలని, ప్రాణాలను కాపాడుకోవాలని వాహనదారులకు సూచించారు. హెల్మెట్ ధరించి తమ భవిష్యత్తును కాపాడాలంటు వారి తల్లిదండ్రులకు సూచించే విధంగా పిల్లలచేత ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ట్రాఫిక్ ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

లైంగికదాడికి యత్నం.. నిందితుడి రిమాండ్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మహిళపై లైంగికదాడికి యత్నించిన నిందితుడికి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ మహేందర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బేగంపూర్ గ్రామానికి చెందిన పెండ్యాల విజయ్‌కుమార్ (25) ఈ నెల 15వ తేదీనా ఆదివారం మధ్యాహ్నం అందజ 2 గంటలకు సమయంలో ఓ మహిళపై లైంగికదాడికి యత్నించాడు. సదరు మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు చేరుకోగా.. నిందితుడు పరార్ అయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు ఇవ్వగా.. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నర్సరీలను పరిశీలించిన డిఆర్డీఓ



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పలు రకాల పనులను శుక్రవారం డిఆర్డిఓ సాయ గౌడ్ ఆకస్మికంగా సందర్శించారు. శ్రీరాంపూర్ గ్రామంలోని నర్సరీ, మండల కేంద్రంలో కోళ్ల పెంపకం షెడ్డు నిర్మాణ పనులను, వన్నెల్-బి గ్రామంలోని నర్సరీ, ఈత ప్రైమరీ బెడ్ లను పరిశీలించారు. అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఓమ్ పాల్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఏపీఓ ఇందిరా, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్

గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు అమూల్యమైనవని.. గణిత శాస్త్రం నేర్చుకోవడానికి ఇష్టంగా కష్టపడాలని ప్రధానోపాధ్యాయురాలు కవిత అన్నారు. ఈనెల 22న ఆదివారం రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా కోమనపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన పలు గణితానికి సంబంధించిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శిస్తూ వివరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయులు భగవాన్ దాస్ శ్రీనివాస రామానుజన్ గురించి వారు చేసిన సేవలను గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నయ్య, గోపాల్, కోకిల నాగరాజు, లక్ష్మీ దేవి పాల్గొన్నారు.

23న జిల్లా కేంద్రంలో నిరసనలు

నవతెలంగాణ-ఎడపల్లి

సంయుక్త కిసాన్ మోర్చా-ఎస్కేయం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రాలలో ఈనెల 23న నిరసనలు తెలుపుతున్నట్టు అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ శుక్రవారం తెలిపారు. రైతు నాయకుడు 21 రోజు జగజీత్ సింగ్ దళవాల్ అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని అన్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, కేంద్ర ప్రభుత్వం తక్షణం అన్ని రైతు సంఘాలతో చర్చలకు పిలవాలని కోరారు. పంజాబ్లో రైతుల పోరాటంకోసం ముగింపు పలకాలని అన్నారు. గ్రేటర్ ఓనియాల్లో జైల్లో ఉన్న రైతు నాయకులను విడుదల చేయాలని, మూడు నల్ల చట్టాలను వెనుక్కు తీసుకోవాలని, స్వామినాథన్ సిఫార్సు అమలు చేయాలని అన్నారు. రైతులు 57 సంవత్సరాల నిండిన వారందరికీ 4 వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీలు ఈ నిరసనలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శ్రీపతి మల్లేష్, కాషా రవి, షేక్ నసీర్, కొండ్రా లక్ష్మణ్, నాగయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పిఆర్సి వేతన బకాయిలను చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు మల్లేష్

నవతెలంగాణ-బోధన్

మున్సిపల్ కార్మికులకు పిఆర్సి బకాయి వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్ పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోధన్ మున్సిపాలిటీలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులుగా పారిశుధ్య, ఎలక్ట్రికల్, ట్రాక్టర్ డ్రైవర్లు, వాటర్ వర్క్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు గతంలో పెరిగిన పిఆర్సి ఎన్నిసార్లు అడిగినా ఇప్పటికీ చెల్లించలేదని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికీ కనీస వేతనాలను నెలకు 26 వేల రూపాయల చొప్పున పెంచి ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి నెల మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలని. పీఎఫ్, ఈఎస్ఐ కార్మికుల వేతనాల నుండి కట్ చేసి ఎప్పటికప్పుడు జమ చేయాలని, కార్మికులకు పనిముట్లు, రక్షణ కవచాలను డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులతో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.గంగామణి, ఆర్. రాజమణి, జి.ఎల్లప్ప, రమ, విజయ, లావణ్య, మరియమ్మ, పోషవ్వ, సాయవ్వ, గాబ్రియేలు, గంగాధర్, శాంత, శంకరమ్మ, లక్ష్మి పాల్గొన్నారు

కేటీఆర్‌పై కేసు కాంగ్రెస్ ప్రభుత్వ అభద్రతా భావానికి నిదర్శనం

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభద్రతా భావానికి నిదర్శనమని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్‌లో కేటీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కక్షగట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాదులో ఫార్ములా ఈ కార్ రేసింగ్ పోటీలు నిర్వహించేలా చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు పేరు ప్రఖ్యాతలు కేటీఆర్ తీసుకొచ్చారన్నారు. ప్రజా కోర్టులో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పరాభవం, తగిన శాస్తి తప్పక జరిగి తీరుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని కేటీఆర్ ప్రజల తరపున పదే పదే ప్రశ్నించడం జీర్ణించుకోలేక అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సమావేశంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మైలారం సుధాకర్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షులు బద్దం రాజేశ్వర్, బిఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షులు కొత్తపల్లి రఘు, నాయకులు సంత రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి నివారణపై అవగాహన

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎల్ఈడి స్క్రీన్ వ్యాన్ ద్వారా హెచ్ఐవిపై స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ మల్లేష్, వైఆర్జీ లింక్ వర్కర్ కే.సుప్రియ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.....హెచ్ఐవి అనేది ఒక వ్యాధి, ఈ వ్యాధి మానవ శరీరంలోని రక్తంలో మాత్రమే ఉంటుందని, ఈ వ్యాధి నాలుగు రకాలుగా వస్తుందని తెలిపారు. ఒకటి సురక్షితం కానీ లైంగిక సంబంధాలు, రెండవది కలుషితమైన సూదులు సిరంజీ, మూడోది హెచ్ఐవి ఉన్న రక్తమార్పిడి, నాలుగవది హెచ్ఐవి సోకిన తల్లి నుండి బిడ్డకు వస్తుందని అన్నారు. ఇది అంటు వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని అన్నారు. హెచ్ఐవి సోకిన వ్యక్తిని తాకిన కలిసి భోజనం చేసినా ఆయన వాడిన వస్తువులు వాడిన కానీ హెచ్ఐవి రాదని వివరించారు. హెచ్ఐవిపై అపోహ ఉన్నవాళ్లు కచ్చితంగా రక్తపరీక్ష చేయించుకోవాలని చెప్పారు. కొన్ని ఎన్జీవోలు హెచ్ఐవి మీద పనిచేస్తున్నాయని, కనుక వారిని సంప్రదించిన సలహాలు, సూచనలు ఇస్తూ భయాందోళన నుండి సురక్షితంగా కాపాడుతారన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రెటరీ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కోఆర్డినేటర్ మల్లేష్, వైఆర్జీ లింక్ వర్కర్ కే.సుప్రియ, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి కూడా విద్య పైన చక్కని ప్రసంగం చేశారని ఆయన తెలిపారు.

రోగులపట్ల ఆప్యాయత చూపెట్టాలి

- అప్పుడే ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపి పెరుగుతుంది
- సబ్ కలెక్టర్ వికాస్



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్

నవతెలంగాణ-ఎడపల్లి

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల వైద్యులు అంకితభావంతో పని చేస్తూ రోగుల సాధకబాధకాలను తెలుసుకొని వారికి నాణ్యమైన చికిత్స అందినప్పుడే వైద్యులను దేవుళ్ళుగా రోగులు కొలుస్తారని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహీతో అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ వికాస్ మహితో శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రిలోని సంబంధిత రికార్డులను ఆయన క్షుణంగా పరిశీలించారు. వైద్యులు ఆస్పత్రిలో ఎంతమంది పనిచేస్తున్నారని, ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో సుమారు ఉప కేంద్రాల్లో 16 మంది విధి నిర్వహణలో ఉంటూ గ్రామీణ స్థాయిలో రోగుల ఆరోగ్య సంరక్షణ పై అడిగి తెలుసుకుంటున్నట్లు సాయిస్తాఫీర్దౌస్ వివరించారు. అనంతరం ఆయన ఆస్పత్రిలోని ల్యాబ్ టెక్నీషియన్స్, బాలింతల గది, మెడికల్ మందులున్న గదులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యను పెంచేందుకు సిబ్బంది కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు ఉంటాయని ఆయన నొక్కి చెప్పారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విధి నిర్వహణలో వైద్యులు తప్పకుండా ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి సంఖ్య పెరగడం పట్ల ఆయన సిబ్బంది పనితీరు సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆర్బిఎస్కే మందులను మాత్రలను ప్రభుత్వం సరఫరా చేస్తున్నందున ఆర్‌విఎస్‌కే మొబైల్ వ్యాన్‌లో ఉన్న టీంను సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైతే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన వైద్యులకు సూచించారు. ఎడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సాయిస్తాఫిర్దౌస్, స్టాఫ్ నర్స్ కే సుమలత, ఆయుష్ వైద్యాధికారి వెంకటేష్, సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎడపల్లి ఎంపీడీవో శంకర్. ఎంపీ ఓ మన్మోహన్ శాస్త్రి, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజుగౌడ్, ఆస్పత్రి సిబ్బంది స్థానిక నాయకులు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలి: సబ్ కలెక్టర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గ్రామపంచాయతీ కార్యదర్శులతో పాటు, సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఎలాంటి తప్పులు లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహీతో అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను శుక్రవారం ఆయన పరిశీలించారు. పూర్తి వివరాలను రికార్డులో నమోదు చేసుకోవాలని ఆయన అన్నారు. ఇల్లులేని నిరుపేదలకు ఖాళీ స్థలం ఉన్నట్లయితే, ఆ స్థలాన్ని గుర్తించేందుకు గ్రామపంచాయతీ అధికారులతోపాటు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తప్పక ఉండాలన్నారు.

నిజమైన పేద, నిరుపేద అర్హులకు ముందు గుర్తించాలన్నారు. ఒకరోజు ఎన్ని ఇందిరమ్మండ్ల సర్వే చేస్తున్నారో గ్రామపంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలను మండల పరిషత్ కార్యాలయానికి అందజేయాలని ఆయన అన్నారు. సర్వే చేసే ముందు ఏమైనా అనుమానాలు వ్యక్తం అయితే సంబంధిత మండల పరిషత్ అధికారిని సంప్రదించి సలహాలు సూచనలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజ్, ఎడపల్లి మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, శివరాం ప్రసాద్‌రావు. ఎడపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి నాగరాజు గౌడ్ పనితీరు పట్ల బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహీతో సంతృప్తి వ్యక్తం చేసి ఆయనను అభినందించారు.

ప్రజాధనం దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్‌పై కేసు

- ఫార్ములా ఈ రేసులో 55 కోట్ల అవినీతి
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఫార్ములా ఈ రేసులో 55 కోట్ల అవినీతి జరిగిందని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినందుకే కేటీఆర్‌పై కేసు నమోదు అయ్యిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్ములా ఈ రేసు కేసులో భాగంగా గవర్నర్ ఆమోదం తెలపడంతో ఏవన్‌గా ఉన్న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేసిఆర్ కుటుంబ అనుచరులు ఆందోళన పడుతూ రేవంత్‌రెడ్డిపై దుష్ప్రచారం చేసే విధంగా పాల్పడుతున్నారని అన్నారు.

గత సంవత్సర కాలంగా కేటీఆర్ హరీష్‌రావు వాస్తవాలను పక్కన పెడుతూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన అన్నారు. ఫార్ములా ఈ రేస్ లో భాగంగా కేటీఆర్ చేసిన అడ్డగోలు ఒప్పందాల వల్లనే ఆయనపై కేసు నమోదు అయిందని తెలిపారు. ప్రభుత్వానికి జిహెచ్ఎంసికి మంత్రి వర్గానికి ఎలాంటి సంబంధం లేకుండా కేవలం కేటీఆర్ పురపాలక మంత్రిగా రాష్ట్రంలో ఈ రేసును నిర్వహించడం జరిగిందని అన్నారు. ఫార్ములా ఈ రేసులో భాగంగా కేటీఆర్ 55 కోట్ల అవినీతి చేశాడని ఏసీబీ కేసు నమోదు చేస్తే దీనిని శాసనసభలో చర్చించాలని పక్కదారి పట్టించే ప్రయత్నం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఫార్ములా ఈ రేసు నిర్వాహణలో ప్రభుత్వం కేవలం మధ్యవర్తిత్వం వహిస్తూ సదుపాయాలను అందించడమే ఒప్పందం చేసుకుందని, కానీ నిర్వహిస్తున్న కంపెనీల లాభనష్టాలకు ప్రభుత్వానికి సంబంధం లేదు అనే విధంగా ఒప్పందం చేసుకుంటే ఫార్ములా ఈ రేసు నిర్వహిస్తున్న క్రమంలో నిర్వహణ కంపెనీలకు 200 కోట్లు నష్టం రావడంతో కేటీఆర్ ప్రజాధనాన్ని 55 కోట్ల రూపాయలు వారికి దారాదత్తం చేశాడని తెలిపారు. కేటీఆర్ అరెస్ట్ అయితే రాష్ట్రవ్యాప్తంగా అల్లర్లు చేయాలని సందేశాన్ని పంపుతున్నాడని, కానీ టిఆర్ఎస్ నాయకులు గమనించాలని అలర్లు చేస్తే తమ పిల్లల జీవితాలే నాశనం అవుతాయి కావున కేటీఆర్ ఈ రేసు కేసును ఏసీబీ వద్ద పరిష్కరించుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా సంవత్సరానికి 600 కోట్లు అనగా 30 సంవత్సరాలకు 18 వేల కోట్లు వచ్చే రింగురోడ్డును హరీష్ రావు తమ ప్రభుత్వం ఉన్నప్పుడు 7300 కోట్లకు ఏ విధంగా కాంట్రాక్టు ఇచ్చాడో, చెప్పాలని దీనిపై ఎంక్వయిరీ వేయాలని హరీష్ రావు ముఖ్యమంత్రికి సూచించడం జరిగిందని ప్రతిపక్షాల సూచన మేరకు ముఖ్యమంత్రి గరేవంత్ రెడ్డి అవుటర్ రింగ్ రోడ్డు పైన విచారణకు సిద్ధం చేస్తున్నారని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హమ్దాన్ మాట్లాడుతూ పార్లమెంటులో అమిత్ షా అంబేద్కర్ పైన చేసిన వాక్యాలు చూస్తుంటే సిగ్గుచేటుగా ఉందని, దేశానికి రాజ్యాంగాన్ని అందించి దేశం ప్రజాస్వామ్య యుతంగా సమానత్వంతో ఉందని అంటే అది కేవలం అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే అని, అలాంటి అంబేద్కర్ గురించి అనుచిత వాక్యాలు చేసిన అమిత్ షా కేంద్ర హెూం మంత్రిగా ఉండడం అనేది దేశానికే సిగ్గుచేటు అని అన్నారు. కావున రాష్ట్రపతి కలుగజేసుకొని అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుండి సస్పెండ్ చేయాలని, వెంటనే అమిత్ షా దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నూడా చైర్మన్ కేశవేణు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఎస్ఎస్యుఐ అధ్యక్షులు వేణురాజ్ ,జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కేశ మహేష్, అబూద్ బిన్ హన్దాన్ ,చందూర్ వైస్ ఎంపీపీ దశ గౌడ్, సాయికిరణ్, మాజీ కార్పొరేటర్లు స్వామి గౌడ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తా



కలెక్టర్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే వాటిని పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హామీ ఇచ్చారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా అధ్యక్షులు కే .రామ్మోహన్రావు ఆధ్వర్యంలో కమిటీ కలిసింది. డిసెంబర్ 17 పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని , సీనియర్ సిటిజన్స్ యొక్క అనుభవం కుటుంబానికి, సమాజానికి ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు కలెక్టర్‌ని శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా నాయకులు రామ్మోహన్ రావు, హమీద్దీన్, ఈవీఎల్ నారాయణ, ప్రసాదు, జీవన్ రావు, లక్ష్మీనారాయణ, బాబా గౌడ్, రైసుద్దీన్, బాలస్వామి తదితరులు ఉన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న పశు వైద్యులు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని హంగర్గా ఫారం గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంస్థ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయగా ఏఎంసి డైరెక్టర్ పి. పావని రిబ్బన్ కట్ చేసి, ప్రారంభోత్సవం చేశారు. శిబిరంలో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథ చారి, పశు గణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణ అధికారి మజీద్ అహ్మద్, పశు సంవర్ధక సహాయకులు డాక్టర్ డి బసవ రెడ్డి పాల్గొన్నారు. శిబిరంలో గర్భకోష చికిత్స 30 పశువులకు, కృత్రిమ గర్భధారణ 3, సాధారణ చికిత్స ఐదు, నట్టల నివారిణి 32 పశువులకు వేశారు. మొత్తం 70 పశువులకు పరీక్షలు చేశారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్ సురేష్ కుమార్, రుద్రూర్ పశువైద్యాధికారి డాక్టర్ డి. సంతోష వివిధ రకాల వ్యాధులను పరీక్షించి, మందులు అందజేశారు. శిబిరంలో దూడల ప్రదర్శన, పాల పోటీ నిర్వహించారు. కృత్రిమ గర్భధారణతో పుట్టిన దూడలను చూసి పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథ్ చారి, గోపాలమిత్రని అభినందించారు. పాల పోటీలో పాల్గొన్న గేదల రైతుల్ని అభినందించారు. పశువులను కృత్రిమ గర్భధారణ చేయించుకుంటే అవి నూటికి 90 శాతం ఆడదూడలే పుడతాయని తెలిపారు. పాల పోటీలో గెలిచిన వారికి బహుమతులు అందించారు. ఈ శిబిరంలో విఎల్ఓ మంజుల, పశు సహాయకులు సుధీర్‌గౌడ్, సూపర్వైజర్ తిరుపతి, గోపాలమిత్ర రియాజ్, నాగేష్, మైత్రి రాజేష్, గ్రామ పాలకేంద్ర చైర్మన్ ఆర్. కృష్ణారెడ్డి, డైరెక్టర్లు వెంకటరామిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, సతీష్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, వెంకటరెడ్డి, గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/బోధన్/ఆర్మూర్



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో 63వ నెంబర్ జాతీయ రహదారిపై అంబేద్కర్ విగ్రహం సాక్షిగా కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు, న్యాయవాది సుంకరి విజయ్ కుమార్ మాట్లాడుతు పాపాలు చేసేవాళ్లే పుణ్యాల కోసం ఆలోచిస్తారన్నారు. దేశం, ప్రజలు, రాజ్యాంగ పరిరక్షణ గురుంచి ఆలోచించే వాళ్ళు అంబేద్కర్ నామాన్నే జపిస్తారన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 326 వల్లనే దేశ ప్రజలు ఓటు హక్కు ద్వారా మిమ్మల్ని ఎన్నుకొని చట్టసభలోకి పంపారన్నారు. రాజ్యాంగం ద్వారానే అమిత్ షా హెూం మంత్రి పదవి పొంది దేశాన్ని పాలిస్తున్నారన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని దేశానికి అంకితం చేసిన మహనీయులు, దేశ ప్రజలకు స్వేచ్ఛ సమానత్వం, సౌభ్రాతత్వం కల్పించి సమ సమాజం నిర్మాణం కోసం జీవితాంతం కృషిచేసిన అంబేద్కర్ పట్ల కేంద్ర హెూంమంత్రిగా ఉన్న వ్యక్తి హేళనగా మాట్లాడడం సరైనది కాదన్నారు. అంబేద్కర్‌ను అవమనపరిచేలా, అవహేళన చేసి మాట్లాడిన కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే హెూంమంత్రి, ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అంబేద్కర్ యువజన సంఘం కార్యదర్శి మేకల శ్రీకాంత్, క్రియాశీల కార్యవర్గ సభ్యులు, మాజీ ఉపసర్పంచ్ పాలేపు చిన్న గంగారాం, కొంటికంటి నరేంధర్, బండి అంజనేయులు, సంజయ్, వినయ్, విభూది అనీల్, బెజగం గంగాధర్, సతీష్, నీలకంఠం, మధుకర్, రాము, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : బిజెపి జాతీయ నాయకులు కేంద్ర మంత్రి అమిత్ షా బాబా సాహేబ్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకిస్తూ శుక్రవారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆయన తక్షణమే తన మాటలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు .బీఎస్పి జిల్లా అధ్యక్షులు సింగడీ పాండు , బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జి ఈశ్వర్, కారం స్వామి, సాయిలు ,సంజీవ్, ఆనంపల్లి ఎల్లయ్య, దేవేందర్, శ్రావణ్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఎంసి మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, వైస్ చైర్మన్ మున్ను, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహనా సదస్సు

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆర్మూర్ ఫైర్ స్టేషన్ వారి ఆధ్వర్యంలో ఫైర్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిలిండర్ వాడే విధానం సిలిండర్ ఫైర్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ వీణ, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్‌ను నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్ శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. యువజన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చైర్మన్ సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ అగర్వాల్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేష్, మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కన్నె కిరణ్ యువజన నాయకులు అల్జాపూర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



చైర్మన్‌ను సన్మానించిన పలువురు

అర్హులైన ప్రతి ఒక్కరిని.. డ్వాక్రా సంఘంలో చేర్పించాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

అర్హులైన ప్రతి మహిళ డ్వాక్రా సంఘంలో చేరే విధంగా చూడాలని డిపిఎం సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల మండల సమాఖ్య కార్యాలయంలో ఆయన వివోఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులు అయినా ప్రతి మహిళ డ్వాక్రా సంఘంలో చేరే విధంగా కృషి చేయాలన్నారు. డ్వాక్రా సంఘంలో ఉన్న ప్రతి మహిళ ఆర్థికంగా సామాజికంగా ఎదుగుతారని ఆయన అన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు పాడి పశువులు నాటు కోళ్ల పెంపకం చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు బెస్త శాంత ఏపీఎం జగదీష్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా బయో సైన్స్ టాలెంట్ పోటీ పరీక్షలో కరణ్‌కు ప్రథమ బహుమతి

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం మరియు జూనియర్ కళాశాలకు చెందిన పదవతరగతి విద్యార్థి కరణ్‌కు జిల్లాస్థాయి బయో సైన్స్ టాలెంట్ లో ప్రథమ బహుమతి లభించింది. కామారెడ్డి జిల్లా బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో కామారెడ్డిలోని సాందీపని జూనియర్ కళాశాలలో ఈరోజు జరిగిన జిల్లాస్థాయి బయో సైన్స్ టాలెంట్ పోటీ పరీక్షలో సీహెచ్ కరణ్ ప్రతిభ కనబరిచారు. ముఖ్యఅతిథి కామారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి రాజు, డీఎస్‌ఓ సిద్దిరాంరెడ్డి చేతుల మీదుగా సిహెచ్. కరణ్ ప్రథమ బహుమతిని అందుకున్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయుడు సంజీవ్ మార్గదర్శనం చేశారు. ప్రిన్సిపాల్. ఎన్ గంగా కిషోర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ సుమన్, సైన్సు ఉపాధ్యాయుడు దత్తాద్రి, సంస్కృతోపన్యాసకులు ప్రముఖ పద్యకవి బి వెంకట్, ఉపాధ్యాయులు.-వేణుగోపాల్,సంతోష్, రాము, గణేష్, సమీనా, సంజు, గోవింద్, శంకర్, బసవరాజు తదితరులు కరణ్ కు శుభాకాంక్షలు తెలిపి, అభినందించారు.

కల నెరవేరింది

- నాగిరెడ్డిపేట్‌లో అందుబాటులోకి 108 అంబులెన్స్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

గత 20 సంవత్సరాలుగా నాగిరెడ్డిపేట్ మండల ప్రజలు ఎదురుచూస్తున్న 108 అబులెన్స్ కల నెరవేరింది. 27 గ్రామ పంచాయతీలు గల నాగిరెడ్డిపేట్ మండలానికి గత 20 సంవత్సరాలుగా అంబులెన్స్ లేక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనానికి కాల్ చేస్తే 20 కిలోమీటర్ల దూరం నుండి అబులెన్స్ రావాలంటే ఆలస్యమయ్యేది. ఇతర మండలంలో ఉన్న ఒక అంబులెన్స్ వారి మండలంలో బిజీ ఉంటే నాగిరెడ్డిపేట్ మండలం నుండి 108కు కాల్ చేస్తే 108 అంబులెన్స్ రాని పరిస్థితి చాలా సార్లు ఎదుర్కొన్నారు మండల ప్రజలు. ఎన్నో ప్రమాదాలు జరిగిన ఎంతోమంది ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం శూన్యంగానే ఉండేది.

ఎట్టకేలకు కల నెరవేరింది

నాగిరెడ్డిపేట్ మండలానికి 108 వాహనం మంజూరు కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే అంబులెన్స్ లేక సకాలంలో రాక గాయపడిన వారు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు చాలా ఉన్నాయి.

24 గంటలు అందుబాటులో 108

నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన 108 వాహనం 24 గంటలు సేవలందించనుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 24 గంటల అందుబాటులో 102 వాహనం అందుబాటులో ఉంది. మండల ప్రజలు ఎవరికి అత్యవసరంగా అవసరమున్న 108 వాహనానికి కాల్ చేస్తే 108 వాహనం సేవలందించడానికి సిద్ధంగా ఉంది.

కేసును బట్టి రిఫర్ చేస్తాం

పేషంట్ పరిస్థితిని బట్టి 108 అంబులెన్స్ లో రిఫర్ చేస్తామని డాక్టర్ సుజన్ కుమార్ తెలిపారు. పేషెంట్ కండిషన్ను బట్టి ఎల్లారెడ్డి , మెదక్, కామారెడ్డి హైయర్ సెంటర్లకు పేషెంట్లను రిఫర్ చేస్తాం. పేషెంట్ ను సేవ్ చేయడానికి మా వంతు మేం ప్రయత్నం చేస్తాం. నాగిరెడ్డిపేట్ మండల ప్రజలకు 108 అంబులెన్స్ సేవలు మరింత చేరువ అయ్యాయి.

– మండల్ మెడికల్ ఆఫీసర్ సృజన్ కుమార్



ఆనందంగా ఉంది



నాగిరెడ్డిపేట మండలానికి అత్యవసరంగా అవసరమైన 102 అంబులెన్స్ మంజూరీ కావడం చాలా ఆనందంగా ఉంది. ప్రమాదాలు జరిగితే వెంటనే ప్రాణాలు కాపాడ్డానికి అత్యవసరంగా ఉపయోగపడే 108 వాహనం నాగిరెడ్డిపేట మండలానికి రావడం చాలా రోజుల కల నెరవేరింది.

– కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీరామ్ గౌడ్

అత్యవసరాలకు అవసరం



ఎవరైనా అనుకోకుండా రోడ్డు ప్రమాదాలకు గురైతే వెంటనే దవాఖానాకు తరలించడానికి 108 వాహనం పనిచేస్తుంది. గత చాలా సంవత్సరాలుగా వాహనం లేకపోవడంతో మండల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 108 అంబులెన్స్ అందుబాటులో ఉంది. ప్రజల సేవలో 24 గంటల పాటూ పని చేయనుంది.

– ఎల్లారెడ్డి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్

ఎస్ఐకి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్‌ను శుక్రవారం మైనార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని సూచించారు. అందరి సహకారంతోనే శాంతి భద్రతలను కాపాడుతామన్నారు. రాష్ట్ర మైనార్టీ శాఖ మాజీ ఉపాధ్యక్షులు ప్రతి యుద్దీన్ హర్షద్ నయీమ్ ఫరూక్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-రామారెడ్డి

కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబానికి నా రెడ్డి స్వచ్చంద సంస్థ శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆదుకుంది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎనుగర్తి నర్సింలు మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నా రెడ్డి స్వచ్చంద సంస్థ వ్యవస్థాపకులు నా రెడ్డి మోహన్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ 2000, 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రగోతం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల సర్వే పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను శుక్రవారం ఎంపీడీవో ప్రకాష్ పరిశీలించారు. మండలంలో బెజగం చెరువు తండా జప్తి జాన్కంపల్లి గ్రామాలలో సర్వేను ఆయన పరిశీలించారు. సర్వే పక్కగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

భిక్కనూర్ (రాజంపేట్): మండలంలోని ఆర్గొండ గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి అపర్ణ ఇందిరమ్మ ఇండ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవో రఘురాం తో కలిసి పరిశీలించారు. దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారుల వివరాలను పగడ్బందీగా యాప్ లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

భిక్కనూర్ : ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో దరఖాస్తు చేసుకున్న వారి అందరి వివరాలు ఆన్‌లైన్‌లో పగడ్బందీగా నమోదు చేయాలని ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. దరఖాసుదారుల ప్రతి వివరాలు తప్పులు లేకుండా యాప్ లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శి అఖిలకు సూచించారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

కాంగ్రెస్ పార్టీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్ వెంకటేష్ ను మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రాజు, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన రెడ్డిపేట విద్యార్థిని

నవతెలంగాణ-రామారెడ్డి

బయో సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన బయో సైన్స్ టాలెంట్ పరీక్షలో మండలంలోని రెడ్డి పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని యు వర్ష ద్వితీయ స్థానాన్ని పొంది, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

విఏఎస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

వతెలంగాణ-మద్నూర్

కామారెడ్డి జిల్లా విఏఎస్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికయింది. ఈ కమిటీ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ ఎం వినీత్ కుమార్ ఎన్నిక కాగా అసోసియేట్ అధ్యక్షునిగా యు శివకృష్ణ ఎన్నికైనట్లు డాక్టర్ వినీత్ తెలిపారు ఈ నూతన కమిటీలో మొత్తం 17 మంది తో బాడీని నియమించినట్లు ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షునిగా మద్నూర్ ఉమ్మడి మండలంలో నీ నూతనంగా ఏర్పడ్డ డోంగ్లి మండల పశువైద్యశాల డాక్టర్ ఎం వినీత్ కుమార్ న్యూ విఏఎస్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షునిగా ఎన్నిక కావడం మద్నూర్ డోంగ్లి మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నిక చేసిన జిల్లా అధ్యక్షులకు ఘనంగా సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసి అందజేత

నవతెలంగాణ-దోమకొండ(పాల్వంచ)

నిరుపేదలను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. పాల్వంచ మండలంలోని ఫరీద్ పేట్ గ్రామానికి చేందిన రామయ్య భార్య రాజవ్వ గత కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం అపరేషన్ అవసరం వుందని, బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఉన్నారని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంటనే రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లడం తో వెంటనే స్పందించి నిమ్స్ హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నుండి చికిత్స నిమిత్తం2,50,000/- రూపాయల ఎల్.ఓ.సి మంజూరు చేయించి హైదరాబాద్ ఆయన నివాసంలో అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లె రమేష్ గౌడ్, నాయకులు ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన బ్రిటన్ యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం బ్రిటన్ యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్ గా ఉన్నటువంటి డాక్టర్ శాంభవి సందర్శించారు. పాఠశాల పనితీరు, ఆంగ్ల భాష బోధన, ఉపాధ్యాయుల భాషాభివృద్ధి, తరగతి గదిలో ఎదుర్కొంటున్న స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసన్న దేవి, ఆంగ్ల ఉపాధ్యాయులు, ఎన్సిసి మాస్టర్ అనిల్ కుమార్, ఉపాధ్యాయుల సురేందర్, తదితరులు ఉన్నారు.

పాలకులు మారినా ఫలితం లేదు

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో పాలకులు మారినా విద్యార్థుల, పేదల బతుకులు మాత్రం మార్పు రాలేదనీ, శాంతియుతంగా చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుల అరెస్టు అప్రాజస్వామికమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఏఐఎస్ఎఫ్ జిల్లా బాధ్యులు దశరథ్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ ఫీజు రీమేజ్మెంట్, స్కాలర్షిప్స్ ఇవ్వాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ అఖిల భారత విద్యార్థి సమైక్య కామారెడ్డి జిల్లా కమిటీ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించే చలో అసెంబ్లీకి వెళ్లేందుకు సిద్ధం కాగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి శివ ప్రసాద్ తోపాటు మరికొంతమందిని పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిపారు. విద్యార్థుల అరెస్టు చేయడం గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం ఉన్నదని ఏఐఎస్ఎఫ్ నాయకులు సంపత్, జస్వంత్, సాత్విక్, నికిత్ అన్నారు. న్యాయం కోసం పోరాడే విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం సరైనది కాదన్నారు.

రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్‌ను సన్మానించిన కళాకారులు



తాడ్వాయి : సన్మానించిన పలువురు కళాకారులు

నవతెలంగాణ-తాడ్వాయి/లింగంపేట్

రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన వెన్నెలను పలువురు కళాకారులు హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సన్మానించారు. జిల్లాకు చెందిన పలువురు కళాకారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్టు సీనియర్ కళాకారు లు సిహెచ్ రమేష్ రావు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై పూర్తిస్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారని కళాకారుల సమస్య లు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ రాము, సవిత, దేవయ్య, విట్టల్ రెడ్డి, కాశిరాం, శిల్ప తదితర కళాబృందసభ్యులు ఉన్నారు.

లింగంపేట్ : తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ వెన్నెలను శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు ఆకుల మహేందర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు.

మంత్రిపదవి రావాలని పూజలు



ఆలయంలో పూజలు చేసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుకు మంత్రి పదవి రావాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నార గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. రామాలయం వద్దకు పెద్ద ఎత్తున మండల కాంగ్రెస్ కార్యకర్తలు ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లింగంపేట్ రామాలయం నుండి ముత్తడి పోచమ్మ ఆలయం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం ముత్తడి పోచమ్మ ఆలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. పనిచేసే సత్తా మాట ఇచ్చి మడమ తిప్పని నాయకుడు మదన్ రావు అన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించే గొంతు మదన్మోహం రావు అన్నారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ మండల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎల్లమయ్య, నాగరాజు, ఏగొండ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ప్రసాద్ గౌడ్, రాజు, నగేష్, అశోక్, శ్రీనివాస్, సాయికుమార్, కిషన్, బైరయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు చేతులమీదుగా ఆయన నివాసంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సంతోషం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు వాసవి గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంతోష్ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ నాగం గోపికృష్ణ, పట్టణ యూత్ అధ్యక్షులు సిద్ధు,4వ వార్డ్ మున్సిపల్ అధ్యక్షులు శంకర్, ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు నాగం శ్రీనివాస్ ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళిత స్పీకర్‌పై దాడిని ఖండిస్తున్నా

- జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్



అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల రౌడీయిజం, దళిత స్పీకర్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గారు అన్నారు. శుక్రవారం నాడు అసెంబ్లీలో ధరణి స్థానంలో భూభారతి బిల్లు ప్రవేశపెట్టే సమయంలో ఉద్దేశ్యపూర్వకంగానే సభను తప్పు దారి పట్టించే విధంగా.. ఫార్ములా - ఈ కార్ రేసులో జరిగిన అక్రమాల పట్ల కేటీఆర్ మీద ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అంశం గురించి చర్చ పెట్టాలని హరీష్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దౌర్జన్యానికి దిగుతూ.. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని అవమాన పరిచేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ మీద పేపర్లు విసురుతూ, వెల్ లోకి దూసుకెళ్లి దాడికి యత్నించిన తీరు తీవ్ర అభ్యంతకరంగా ఉందని అన్నారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నందుకే మాజీ సీఎం,ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదని ఆరోపించారు.

పార్లమెంట్ లో కేంద్ర మంత్రి అమిత్ షా రాజ్యాంగ ప్రధాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని, అదేవిధంగా ఇక్కడ తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళిత స్పీకర్ మీద దాడికి యత్నించారని విచారం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో ఇది ఒక చీకటి రోజుగా అభివర్ణించారు. శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు సభలో ప్లకార్డులు ప్రదర్శించవద్దు, నినాదాలు చేయొద్దు, వెల్ లోకి రావొద్దని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే నిబంధనలు తీసుకొచ్చిందని..ఈ నిబంధనలతోనే గతంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని, సంపత్‌ను సస్పెండ్ చేశారని గుర్తుచేశారు. ఇవే నిబంధనలు అమలు చేస్తూ స్పీకర్‌ను అవమానపరుస్తూ, సభ నియమాలు ఉల్లంఘించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సీఎం కప్ ఖోఖో పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రథమ బహుమతిని సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనారని ప్రిన్సిపాల్ నందాల గంగాకిషోర్, పిఈటి జాదవ్ గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జరిగిన సీఎం కప్ జిల్లాస్థాయి ఖో ఖో పోటీల్లో జి జగదీష్ (8 వ తరగతి) , బి.ఋుతిక్, సిహెచ్ కరణ్ ,కే బాలాజీ (10 వ తరగతి) ,టి జవహర్ సింగ్ (9వ తరగతి) , పి నిఖిలేష్ (ఇంటర్ ప్రథమ సంవత్సరం)లు పాల్గొని, ఖో ఖో పోటీలో విజయం సాధించారని చెప్పారు. వీరికి రేపు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాల్ బహుమతులను జేయనున్నారని చెప్పారు. జిల్లా యువజన క్రీడా అభివృద్ధి శాఖ అధికారి ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యాలయంలో ప్రత్యేకంగా విద్యార్థులను అభినందించారు. జగదీష్ అనే విద్యార్థి ఉత్తమ క్రీడాకారుడుగా ఎంపికైనందుకు ప్రిన్సిపాల్ గంగాకిషోర్ స్పైక్ షడు ను ఉచితంగా అందజేశారు.

విజేతలకు సహాయ ప్రిన్సిపాల్ సుమన్, ఉపాధ్యాయులు-పద్యకవి బి.వెంకట్, సంతోష్, వేణుగోపాల్, నరహరి, రాము, సమీనా తదితరులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



గెలుపొందిన గురుకుల విద్యార్థులు

చైర్‌పర్సన్‌ను కలిసిన నూతన మున్సిపల్ కమిషనర్ స్పందన

నవతెలంగాణ-కామారెడ్డి

మున్సపల్ కమిషనర్‌గా స్పందన గురువారం ఇన్చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం ఇందుప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ అభివద్ధి కోసం పాటుపడాలని, ఇక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అందుకు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పంపరి లక్ష్మణ్, గోని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-కామారెడ్డి



ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో లయోల పాఠశాల, కామారెడ్డిలో జరిగిన జూనియర్ గర్ల్స్ 22/12/2024 నుంచి హాకింపెట్ లో జరిగే 50 వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొనేందుకు బాలికల విభాగంలో కావ్య, హర్షిక, సుచరిత, కవిత, సంధ్యారాణి, ఉష, శృతి, మౌనిక, నికిత, లక్ష్మీ ప్రసన్న, కీర్తన, రిషిక వీరికి టీం లీడర్లుగా, శిరీష, సునైన, జ్యోతి ఎంపికైనట్టు కబడ్డీ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రంగ వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. జూనియర్ బాయ్స్ ఈ నెల 27 నుంచి జనగామ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్స్ యు 20 కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు (బాలుర విభాగంలో) వంశీ, శివ స్వామి, నవీన్, విటల్, ఆంజనేయులు, ప్రహ్లాద్, అరవింద్, సంపత్, అజయ్ కుమార్, మహేష్, రామ్ సింగ్, నీరజ్ కుమార్ వీరికి టీం లీడర్ లు గా వెంకటేష్ , గణేష్, సంపత్‌ను ఎంపిక చేసినట్టు తలిపారు. ఈ ఎంపికలను ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణాల భాస్కర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి నోముల మధుసూదన్ రెడ్డి, కెపి, అనిల్ కుమార్, లక్ష్మణ్ రాథోడ్, రాజేందర్ రెడ్డి, రేణుక, విజయలక్ష్మిరవి, సభాత్, సంజీవులు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సూచనలతో అధిక దిగుబడి



రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కాటేపల్లి శివారులో పంటను పరిశీలిస్తున్న అధికారులు పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి మండలంలోని కాటేపల్లి గ్రామ శివారులో గల యాసంగి పంటలను జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలను పాటిస్తూ ఏ సమయానికి ఎటువంటి పురుగుమందులు అడుగు మదులు వాడాలో సూచనలు తీసుకుంటే పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు. గతంలో పంట సాగు చేసే సమయంలో తమ సిబ్బంది ఆన్లైన్లో పంట నమోదు చేశారని తెలి పారు. క్రాస్ చెకింగ్లో భాగంగా తాను ఏఈవోలు నమోదు చేసిన పంట నమోదును పరిశీలించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాలు తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ బీసీ బాలికలు, ఎస్సీ బాలుర వసతి గృహాలను తహసిల్దార్ శ్రావణ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం వసతి గృహాలకు నూతనంగా 40 శాతం మెస్ చార్జీలు పెంచడంతో నాణ్యమైన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేయాలని ఆయన హాస్టల్ వార్డెన్ రాధా రాణికి సూచించారు. పప్పులను ఆయన పరిశీలించారు. వంట దినుసులను పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చదువుకోవడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన నూతన మెనూ పరిశీలించారు. పౌష్టికాహారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన సిబ్బందిని హెచ్చరించారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ రాధా రాణి, మండల గిర్ధవార్ మన్సూర్, తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-జుక్కల్

గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఎంపీడీవో సూచించారు. శుక్రవారం చెందేగావ్ మాదాపూర్ గ్రామాల ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో లబ్ధిదారులను గుర్తించిన వారి నుంచి అన్ని విధాల సాహాయ సహకారాలు తీసుకోవాలని తెలిపారు. సమాచారం మొత్తం కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి పై అధికారులకు నివేదికలు అందించాలని సర్వే అధికారులకు సూచించారు. అనంతరం పలువురు ఎంపిక చేసిన లబ్ధిదారులతో ముచ్చటించి సమస్యల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాము, చెందేగావ్ గ్రామపంచాయతీ కార్యదర్శి వికాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు

- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతుందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బద్దం ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పైన ఫార్ములా ఈ కార్ రేస్ అక్రమ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దమ్ముంటే ఈ కార్ రేస్‌పైన అసెంబ్లీలో చర్చ పెట్టాలని, స్పీకర్‌కు తీర్మానం లెటర్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గి కేటీఆర్‌పైన కేసులు పెట్టడం తగదని తెలిపారు. దమ్ముంటే అభివృద్ధిలో పోటీ పడి ప్రజలకు మేలు చేయాలని ప్రజల కోసం ప్రశ్నించిన నాయకులపైన కేసులు పెట్టడం తగదని మండిపడ్డారు. ఇప్పటికైనా ఈ ఫార్ములా ఈ కార్ రెసింగ్ కేసు వెనక్కి తీసుకోని ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాలపైన దృష్టి పెట్టాలని కోరారు.


మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీ ఇలాంటి తప్పుడు కేసులు పెట్టడం సరికాదని ఇకనైనా తీరు మార్చుకోవాలని సూచించారు. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు సిరికంటి సాగర్ యాదవ్, శ్రీకాంత్ చారి, ఎంబరి శరత్, శ్రీనివాస్, న్యావనంది సాయన్న, ఎంఏ.షాహిద్, ఆకుల నరేందర్, మానేటి నాగభూషణం, జువ్వన్న, ఈపి.నారాయణ, కన్న పోశెట్టి, ఫయాజ్ అలీ, ఇఫ్తాకారోద్దీన్, షేక్ ఆరిఫ్, సూర్య ప్రకాష్, ద్యావతి రవి, హాస్టల్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కేసులతో రాక్షస పాలన

- బీఆర్ఎస్ నాయకులు


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఫార్ములా ఈ-కార్ రేస్‌పై పెట్టిన కేసు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నరాని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉమా శంకర్, టి.రాజన్న, నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కొమ్ముల మోహన్, బ్రమ్మదండి లింగం, ముఖిద్, శ్రీనివాస్ గౌడ్, సాజిత్ బద్దం చిన్న నర్సయ్య తదితరులు పాల్గొన్నారు..

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని వేంపల్లి గ్రామంలో మల్లారి గంగాధర్, సంగేమ్ రాజేశ్వర్, కుమ్మరి భూమన్న, బొల్లవత్రి శ్రీనివాస్ కుటుంబాలకు మంజూరైన చెక్కులను ఇంటింటికి వెళ్లి ఇవ్వడం జరిగిందని గ్రామ శాఖ అధ్యక్షులు గంగారాం తెలిపారు. మొత్తంగా రూ.1లక్ష70వేల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం లబ్ధిదారులు బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముత్యం రెడ్డి, సొసైటీ చైర్మన్ జక్క రాజేశ్వర్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దనేష్ యాదవ్, ఇంచార్జ్ మహేష్ యాదవ్, మాజీ ఉప సర్పంచ్ జక్క గంగాధర్, సీనియర్ నాయకుడు రాజ్ కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ రామకృష్ణ యాదవ్, సీనియర్ నాయకులు లింగన్న, అశోక్ పాల్గొన్నారు.

జూనియర్ బాలికల కబడ్డీ సెలక్షన్స్‌లో 15 మంది ఎంపిక

నవతెలంగాణ-ముప్కాల్

హైదరాబాద్ పట్టణ కేంద్రంలో హఖీమ్ పేట క్రీడా మైదానంలో ఈ నెల 22 నుంచి 25 వరకు 50వ జూనియర్ అండర్-20 బాలికల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్టు సెలక్షన్‌లో పాల్గొన్న క్రీడాకారుల నుంచి 15 మందిని ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందులో భాగంగా శనివారం 15 మంది నుంచి 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసి జట్టును పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పేట ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, జిల్లా కబడ్డీ సంఘ బాధ్యులు రాజేందర్, రాజ్ కుమార్, అనురాధ, జ్యోతి నాగభూషణం, గంగాధర్, రాజేశ్వర్, సురేష్, బ్రిజేష్, రాజ్ కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు..

నేడు అలీ సాగర్ నీటి విడుదల

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని కోస్లి పంప్ హౌస్ వద్ద అలీ సాగర్ లిఫ్టు ద్వారా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి శనివారం నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ ప్రణయ్ కుమార్ శుక్రవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హాజరై రబీ సీజన్ సాగునీటి కోసం నీటిని విడుదల చేయనున్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు మద్దతు తెలిపిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఏర్గట్ల

తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని 14 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు మద్దతుగా శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన భౌతిక రసాయన శాస్త్ర యూపీ లెవల్ కాంప్లెక్స్ మీటింగ్‌లో మూడు మండలాల ఉపాధ్యాయులు భోజన సమయంలో సమ్మెకు మద్దతు తెలిపారు. వారి న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఇందులో భాగంగా కాంప్లెక్స్ హెచ్.ఎం.కృష్ణాచారి, సెక్రెటరీ మునీరోద్దీన్, మూడు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలను తనిఖీ చేసిన కమిషనర్


వంట శాలను పరిశీలిస్తున్న కమిషనర్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలని మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కొత్త డైట్, పెరిగిన కాస్మొటిక్ చార్జెస్ గురించి విద్యార్థులను అడిగి, వాళ్ళ అభిప్రాయం తెలుసుకున్నారు. అలాగే పాఠశాల పరిసరాలను, వంటగది, స్టోర్ రూమ్, బాత్రూంలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, ముఖ్యంగా చదువు పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సీనియర్ అసిస్టెంట్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో వైభవంగా శివపార్వతుల కళ్యాణం

నవతెలంగాణ-ఏర్గట్ల

మార్కండేయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. సాయంత్రం పల్లకి సేవలో మాహిళా భక్తులు మంగళహారతులతో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో శతాధిక దైవ విగ్రహ ప్రతిస్టాపనాచార్యులు గురుమంచి చంద్రశేఖర శర్మ, ఆలయ ప్రధానార్చకులు రాకేష్ శర్మ, పద్మశాలి సంఘ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

శాంతి, ప్రేమ, సహనం ఆచరణీయం

- నుడా చైర్మెన్ కేశ వేణు
- ప్రెస్ క్లబ్‌లో సపోజ్ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-నిజామాబాసిటీ

ఏసు ప్రభువు బోధనలు ఆయన చూపిన శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనమనే గొప్ప లక్షణాలు ఎప్పటికీ ఆచరణీయమని నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సపోజ్ క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూడ చైర్మెన్ కేశ వేణు మాట్లాడుతూ.. శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పే క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమని తెలిపారు. రాష్ట్రంలో సెక్యులర్(మత సంబంధం లేని) ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. మతసామరస్యాన్ని కాపాడుకుంటూ, పరిపాలన పారదర్శ కంగా, ప్రజాస్వామికంగా తెలంగాణ రాష్ట్రంలో సాగుతుందని పేర్కొన్నారు. క్రిష్టియన్ సోదరులు సంతోషంతో, ఆనందోత్సహాలతో క్రిస్మసన్ను జరుపుకోవాలనీ, క్రీస్తు మార్గాన్ని అనుసరించి సమాజ అభివృద్ధి కోసం అందరు పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అంతడుపుల రామకృష్ణ, బైర శేఖర్ మాట్లాడుతూ.. కుల, మతాలకతీతంగా అన్ని పండగలను ప్రతి సంవత్సరం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. నిజామాబాద్ సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ప్రకాష్, తెలంగాణ యునైటెడ్ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు జకర్యా ఆనంద్, ప్రధాన కార్యదర్శి డానియల్, కోశాధికారి జాన్ బనియన్, సపోజ్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. సపోజ్ క్రిస్మస్ వేడుకలపై క్లుప్తంగా వివరించారు. సిఎస్ఐ చర్చ్ కమిటీ ఆధ్వర్యంలో పాటలు ఆలపించడంతో ప్రతి ఒక్కరిని అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు నుడా చైర్మన్ కేశవ వేణుతోపాటు పాస్టర్లు, జర్నలిస్టుల మధ్యలో సపోస్ క్రిస్మస్ వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలను ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అతిథులకు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి సందీప్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్, నగర జర్నలిస్టులు, సదానంద్, రవి, అనంథ్వాల్, రాజేశ్వర్, రాజ్ కుమార్, రాజు, జైపాల్, జాక్సన్, ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, నగర జర్నలిస్టులు పాల్గొన్నారు.


ప్రెస్‌క్లబ్‌లో సపోస్ క్రిస్మస్ వేడుకలు

రాష్ట్రస్థాయి గణిత సెమినార్‌కు ప్రధానోపాధ్యాయుడు ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



తెలంగాణా రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు నిజామాబాద్ జిల్లా కోనాపూర్ ప్రధాన ఉపాధ్యాయుడు ఎంపికయ్యారు. ఈ నెల 22 వ తేదీ జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా తెలంగాణ యస్‌సిఈఆర్‌టీ నిర్వహించే రాష్ట్ర స్థాయి గణిత సెమినార్‌కు నిజామాబాద్ జిల్లా కోనాపూర్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు చౌదారపు రాంప్రసాద్ ఎంపికయ్యారు. 21 వ శతాబ్దంలో గణిత ఉపాధ్యాయులు వినూత్న పద్ధతుల ద్వారా బోధన, ఉన్నత పాఠశాల గణిత బోధనలో డిజిటల్ పరికరాలు, వనరులు అనే అంశంపై పరిశోధనా పత్రం రాంప్రసాద్ సమర్పించారు. నిజామాబాద్ జిల్లా విద్యాధికారి అశోక్ సైన్సు అధికారి గంగా కిషన్, కమ్మరి పల్లి ఎంపిడిఓ రాజ శ్రీనివాస్ ,తహసీల్దార్ ఆంజనేయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, నోడల్ అధికారి గంగాధర్, ప్రధానోపాధ్యాయులు సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్, ప్రధాన కార్యదర్శి నరేష్, ద్రుపతి కుమార్, తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కందికొండ శ్రీనివాస్, నిజామాబాద్ బాధ్యులు కృష్ణ, గోపాల కృష్ణ, కాంతారావు అభినందించారు. రాంప్రసాద్ గత అయిదు సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి కి ఎంపిక కావడం అభినందనీయం అని పలువురు తెలిపారు.


ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో శుక్రవారం మండల కేంద్ర శివారులో ఉన్న అనువైన ప్రభుత్వ భూములను ఆర్డీవో రాజగౌడ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదికను పంపి త్వరలోనే వివరాలు తెలియజేస్తామని అన్నారు. జిల్లా డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ రమేష్, పోచంపాడు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ రాకేష్, తహసీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ పి.శ్రీకాంత్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు సిద్ధ రమేష్, కార్యదర్శి నేర నర్సయ్య, గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, సెక్రటరీ సంజీవ్ థామస్, స్థానిక రెవిన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు టి.సాయన్న గంగారాం, బాబురావ్, కట్ట మహేష్, కట్ట గోపి, కంచు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు..

ప్రజాపాలనలో అక్రమ అరెస్టులా


అరెస్టయిన ఆటో యూనియన్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అసెంబ్లీలో చర్చించాలని ఆటో జేఏసీ పిలుపు ఇస్తే ముందస్తు అరెస్టులు చేయడం దుర్మార్గం అని ఆటో యూనియన్(సీఐటీయూ) నగర అధ్యక్షులు కృష్ణ అన్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులకు నెలకు 12వేల రూపాయలు ఇస్తానన్న హామీని విస్మరించిందని తెలిపారు. వెంటనే ఆటో కార్మికులకు 12వేలు పారితోషికం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జావేద్, పండరి, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

పోషణ్ అభియాన్ కార్యక్రమాలకు అన్ని శాఖలు సహకరించాలి

- అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోషణ్ అభియాన్ కార్యక్రమాలు జరగాలంటే అన్ని శాఖలు సహకరించాలని, అప్పుడే గర్భవతులు, బాలింతలు, పిల్లల పోషణ స్థాయి మెరుగు పడుతుందని అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం డిస్ట్రిక్ట్ న్యూట్రిషన్ కమిటీ సమావేశం జిల్లా సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్వాడిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. భవన నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూట్రిషన్ కమిటీ సభ్యులు, సిడిపివోలు, సూపరింటెండెంట్, సూపర్‌వైజర్‌లు, అంగన్వాడీ టీచర్‌లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

22న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

- హాజరుకానున్న ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ




నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కోటి 56 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించనున్నారు. 40 సంవత్సరాల కిందట నిర్మించిన పురాతన ఆరోగ్య కేంద్రం శిథిలవస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం నూతన భవనానికి శ్రీకారం చుట్టింది. మండల కేంద్రంలో నూతన భవన నిర్మాణం చేపట్టడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిజామాబాద్ ఆధ్వర్యంలో 14వ రోజు సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ దీక్షలకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సత్యానంద్, ప్రధాన కార్యదర్శి రమేష్ సమగ్ర శిక్ష ఉద్యోగులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు రాజు, భూపెందర్ మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు నిరసనలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవట్లేదని అన్నారు. రెగ్యులరైజేషన్ సత్వరమే చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, మహిళా అధ్యక్షురాలు గంగామణి, నాయకులు ప్రకాష్, అప్సర్, రవి కిరణ్, జాన్ సత్యపాల్ గంగాధర్, ప్రభు, రమేష్, రాణి, సుప్రజ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.


అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

అసెంబ్లీలో ప్రతిపక్షం వ్యవహరించిన తీరు సరైంది కాదు: ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

అసెంబ్లీలో ప్రతిపక్షం వ్యవహరించిన తీరు సరైంది కాదని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ వ్యవహారాల తీరు పైన అలాగే భూభారతి వెబ్సైట్ పైన శాసనసభ సమావేశాల్లో జరుగుతున్న సమయంలో అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలు వ్యవహారశైలి సరైనది కాదని, ప్రతి విషయంలో సభను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. ధరణి ద్వారా అప్పటి పాలకులు ప్రభుత్వ భూములను సొంత భూములుగా మార్పు చేశారని, ఎంతోమంది పేదలకు అన్యాయం జరిగిందని, భూ భారతి ద్వారానే రెవెన్యూ వ్యవస్థలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త మార్పులు తీసుకువచ్చారని పేర్కొన్నారు.

భూభారతి ద్వారా రైతులకు న్యాయం

- నియోజకవర్గం కిసాన్ కేత్ అధ్యక్షులు కిషన్

నవతెలంగాణ-వర్ని

ధరణి ఆన్ లైన్ ద్వారా రైతులకు ఇబ్బందికరంగా మారిందని, అందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరణిని రద్దు చేస్తు " తెలంగాణ భూ భారతి " తీసుకరావటం రైతుల మేలు కొరకే అని బాన్సువాడ నియోజకవర్గం కిసాన్ కేత్ అధ్యక్షులు కిషన్ పేర్కొన్నారు. తప్పుల తడకగా మారి రైతుల ఉసురు తీసిన ధరణి వ్యవస్థ రద్దు చేస్తు గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారిని తీసుకువచ్చి గ్రామ స్థాయి లో రెవెన్యూ సేవలు అందించాలని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశం తో భూ భారతి చట్టన్ని తీసుకువచ్చారని తెలిపారు. రెవెన్యూ శాఖను కూడా గ్రామ స్థాయిలోకి తేవటం ప్రజలకు మంచి జరుగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

సహకార సంఘాల కార్యదర్శులతో సమావేశం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఉమ్మడి జిల్లా సహకార సంఘాల కార్యదర్శులతో శుక్రవారం రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ బాదావత్ తారాచంద్ నాయక్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల రైతుల సమస్యలపై, రైతు రుణమాఫీ పై, రైతులకు సంబంధించిన యూరియా బిపిపి, ఇతర రైతు సమస్యలపై చర్చించారు. అనంతరం రాష్ట్ర రైతు కమిషన్ సభ్యులుగా ఎన్నికైన గడుగు గంగాధర్‌ను చైర్మన్, కార్యదర్శులు సన్మానించారు.

ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా బోరు మోటారు మంజూరు

నవతెలంగాణ-భీంగల్ రూరల్



మండలంలోని ముచ్కూర్ గ్రామంలోని ఎస్సీ వాడలో ఎస్‌డీఎఫ్ నిధుల ద్వారా రెండు లక్షల రూపాయలు మంజూరు చేయించి బోరును వేయించారు. ప్రజలు తాగునీటికి గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని గ్రామానికి సంబంధించిన కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ తెలుసుకున్నారు. వెంటనే నిధులు మంజూరు చేయించి బోరు మోటరు మంజూరు చేయించారు. దీనితో దీంతో ఎస్సీ కాలనీ మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేస్తు ముత్యాల సునీల్ కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రిపదవి నుండి బర్తరఫ్ చేయాలి

- అమిత్‌షా వ్యాఖ్యలపై భగ్గుమన్న పలు పార్టీల నాయకులు
- బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్:రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హెూం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో చేసిన అనుచిత వ్యాఖ్యలపై జాతికి క్షమాపణ చెప్పి, తన మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పులాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక కులానికో మతానికో ప్రాంతానికో భాషకో ప్రతినిధికాదని ఆయన ఒక విశ్వ మానవుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఎల్‌టీయూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బిఎల్‌పి రాష్ట్ర కమిటి సభ్యురాలు దండు జ్యోతి, పార్టీ నగర కమిటి నాయకులు పద్మిని వాగ్మారే, రాధా బాయి, జిజాబాయి, ప్రకాష్, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :అమిత్ షా వాక్యాలపై నాగారం ఐదవ టౌన్ పరిధిలో ఐద్వా ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా భారత దేశ ప్రజల సమస్యలు, విద్యా, వైద్యం ఉద్యోగం, మహిళలపై హింస వీటి గురించి మాట్లాడకుండా అంబేద్కర్ అంబేద్కర్ అని జపం చేయడం ఈమధ్య ఫ్యాషన్ అయిపోయింది. ఆయన ఏమన్నా దేవుడా ఆయన కూడా మనిషే కదా.. అన్నిసార్లు ఆయనను తలిచే బదులు దేవున్ని గుర్తు చేసుకుంటే పది జన్మల పుణ్యమైన వస్తుందని పార్లమెంటులో అవమానించారన్నారు. దేశాన్ని ఏలుతున్నారంటే అది బాబా సాహెబ్ అంబేద్కర్ పెట్టిన బిక్షఅని అన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ని ఏ పార్లమెంట్లో అవమానించారో అదే పార్లమెంట్లో క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని తెలిపారు. లేదంటే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేసి ఇంటికి పంపించే అంతవరకు వెంబడిపడతామనానరు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు రజియా, నగర నాయకులు రేఖ, శ్రీదేవి, పద్మ, యశోద, శిరీష, తదితరులు నాగారం ప్రాంతవాసులు 80 క్వార్టర్స్ వాసులు, ఆర్‌జికే వాసులు, దొడ్డి కొమురయ్య నగర్ వాసులు, బహుజన కాలనీ వాసులు, పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :భారత పార్లమెంట్‌లో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా మాట్లాడిన మాటలకు నిరసనగా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు స్థానిక పులాంగ్ చౌరస్తాలో రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా రాజీనామా చేసి జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సుధాకర్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

బాల్కొండ :భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హెూమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం శుక్రవారం చేశారు. అమిత్ షా వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తౌటు అరవింద్, కాంగ్రెస్ మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ జావిద్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌ను హేళన చేస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షా



ఏర్గట్లలో..

వ్యాఖ్యలపై దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మతో శవయాత్ర చేశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ... అమిత్‌షాను కేంద్ర మంత్రి పదవి నుండి తప్పించి, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేయాలని అన్నారు. దళిత సంఘ నాయకులు దిబ్బ సుదర్శన్, గన్నారపు రాజేశ్వర్, అట్ల పోచయ్య కుండ చక్రి, సురేష్, శాంసన్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :ఆలూరు మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద మాల మాదిగ యువజన నాయకులు ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు అమిత్‌షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమం అగ్గు క్రాంతి, పెండ భాస్కర్, ప్రదీప్,బంజారా జాన్,సజన్,రవి,భోజన్న, నవనీత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని(చందూర్) : బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి చందూర్ మండల మాల మహానాడు నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గురించి కేంద్ర మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయటంపై మండిపడ్డారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు, తదితరులు పాల్గొన్నారు



బాల్కొండలో..



కంఠేశ్వర్: బీఎల్‌పీ ఆధ్వర్యంలో..



కంఠేశ్వర్ : ఐద్వాఆధ్వర్యంలో..

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఐఎన్‌టియుసి నాయకులు మల్యాల గోవర్ధన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు శ్రద్ధానంద్ గంజిలో పనిచేస్తున్న దడువాయి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టియుసి నాయకులు మల్యాల గోవర్ధన్ అన్నారు. గతంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. పిసిసి అధ్యక్షుడి హెూదాలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కార్మికులపై ఉన్న చిత్తశుద్ధితో జిల్లా కలెక్టర్ కి ప్రత్యేకంగా లేఖను రాసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరడం పట్ల ఐఎన్‌టి యు సి నాయకులు మల్యాల గోవర్ధన్, దడువాయి యూనియన్ అధ్యక్షులు ఎన్ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్.రవీందర్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆ లేఖను జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు మల్యాల గోవర్ధన్, మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిగా వ్యవహరిస్తుంది అనడానికి అధ్యక్షుని హెూదాలో జిల్లా కలెక్టర్ గారికి ప్రత్యేకంగా లేఖ రాయడమే నిదర్శనంగా కనబడుతుంది అన్నారు. దడువాయి కార్మికులకు వ్యవసాయ మార్కెట్ 15 కిలోమీటర్ల పరిధిలోని ఐకెపి సెంటర్లలో అవకాశం కల్పించాలని, కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, ఇందిరమ్మ ఇండ్లను కార్మికులందరికీ మంజూరు చేయాలని కోరామన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో దడువాయి యూనియన్ గౌరవ అధ్యక్షులు లవంగా అశోక్, అధ్యక్షులు నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రణం రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు ఘన సన్మానం

నవతెలంగాణ-ధర్పల్లి



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్నపూర్వవిద్యార్థులు

మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం తమకు విద్యాబుద్దులు నేర్పించి, ఉన్నత శిఖరాలకు చేర్చి ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన అధ్యాపకులకు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇదే కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సంపాదించిన వాల్గొట్ గ్రామానికి చెందిన శ్రావణ్ టీచర్‌గా రవి ఉద్యోగాన్ని పొందడంపట్ల హర్షంవ్యక్తం చేశారు. గురువులు లాభిశెట్టి మహేష్, సురేష్ బాబు, మామిడి విట్టల్, అర్చన మేడంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సిపిఐ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ నగర కార్యదర్శి వై.ఓమయ్య అన్నరు. శుక్రవారం సిపిఐ పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26తో 100వ సంవత్సరంలో అడుగిడుతున్న సందర్భంగా అంబేద్కర్ కాలనీలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా జండా ఆవిష్కరణ ప్రదర్శన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ నగర పరిధిలోని సిపిఐ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భావం కోసం సిపిఐ నాయకత్వాన అవిశ్రాంత పోరాటం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర నాయకులు పి.హనుమాన్లు, బి.అనిల్, కండ్లకోయ గంగాధర్, ఇమ్రాన్ అలీ, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి తండాలో ఎరువుల గోదాం పారంభం

- డిసిసిబి బ్యాంక్ మేనేజర్ వసంత, చైర్మన్



నవతెలంగాణ-వర్ని(చందూర్)

రైతులకు ఎరువులు అందుబాటులో ఉండాలని మినీ ఎరువుల గోదాం ములను ఏర్పాటు చేయటం జరిగిందని డిసిసిబి చందూర్ బ్యాంక్ మేనేజర్ వసంత, చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలో గల మేడిపల్లి తాండ రైతులకు అనుకూలంగా నూతన ఎరువుల గోదాంను వారు పారంభించారు. కార్యక్రమంలో సోసైటీ వైస్ చైర్మన్ తారసింగ్, మాజీ సర్పంచ్‌రవి, డైరెక్టర్లు రాతోడ్, భజనలాల్, నిరడి బాలయ్య, అంగోత్ శంకర్, మేడిపల్లి సాయిలు, మాజీ ఎంపీటీసీ శ్యాంరావ్, సీఈఓ భూమయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విజేతలుగా వివేకానంద విద్యార్థులు

- జావలిన్‌త్రో, రన్నింగ్‌లో బహుమతులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజారం స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో వివేకానంద స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. గురువారం అథ్లెటిక్స్ అండ్ స్పోర్ట్స్ రాజుగౌడ్ ఆధ్వర్యంలో ట్రస్మా నిర్వహించిన పలు క్రీడా విభాగంలో వివేకానంద హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటిలలో పాల్గొని విజేతలు అయ్యారు. వారిలో జావలిన్ త్రోలో మొదటి విజేతగా హర్షియాకాణం, మూడో విజేతగా కల్పన, రన్నింగ్ పోటీల్లో మూడో విజేతగా జై విద్యార్థులు గెలుపొందారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, విద్యార్థులకు మేడల్స్, బహుమతులను అందజేశారు. ఈ క్రీడల్లో గెలుపొందిన సందర్భంగా పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ నారాగౌడ్, కరస్పాండెంట్ లత, ఉపాధ్యాయులు గెలుపొందిన విద్యార్థులను అభినందించారు.



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

సమగ్ర శిక్షా ఉద్యోగస్తుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌లో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు శువ్రకారం మద్దతు తెలిపి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సమగ్ర శిక్ష ఉద్యోగస్తులు సమ్మె చేస్తే రేవంత్ రెడ్డి, సీతక్క కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి అయిన కనీసం వారితో చర్చలు జరుపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పది, ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని విద్యాశాఖలో సమ్మె ప్రభావంతో పనులన్నీ స్తంభించిపోయిన ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యూ జిల్లా నాయకులు మనోజ్, నిఖిల్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలను వినియోగించుకోవాలి

బాల్కొండ క్లస్టర్ ఏఈఓ రేష్మ

నవతెలంగాణ-బాల్కొండ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ప్రయోజనార్థం నిర్వహిస్తున్న ఉచిత భూసార పరీక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని బాల్కొండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని రేష్మ తెలిపారు. శుక్రవారం బాల్కొండ క్లస్టర్ పరిధిలోని నాగపూర్ గ్రామంలో భూసార పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు క్షేత్రస్థాయిలో ప్రదర్శన చేసి చూపించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ తరపున సాయిల్ హెల్త్ మేనేజ్మెంట్ పథకంలో భాగంగా మండలంలోని రైతులకు సంబంధించి ఉచితంగా భూసార పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష కార్డులను అందజేస్తామన్నారు. కావున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ రైతులను కోరారు.

కెమిస్ట్రీ బోధించుటకు దరఖాస్తులకు ఆహ్వానం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో కెమిస్ట్రీ బోధించుటకు అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపల్ హర్సియా నాజాం కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని ఆమె అన్నారు. అర్హత ఎంఎస్సీ బీఈడీ కలిగి ఉండాలని, ఆసక్తి గలవారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా అథ్లెటిక్స్ పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పట్టణ ట్రస్మా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలు గురువారం ముగిశాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలు సాయంకాలం 5 గంటల వరకు నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ట్రస్మ అధ్యక్షులు నిత్యానంద్ రాష్ట్ర నాయకులు జయ సింహగౌడ్, ట్రస్మా జిల్లా ముఖ్య సలహాదారులు మామిడాల మోహన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కపిల్, కార్యదర్శి రాజాగౌడ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ట్రస్మా జిల్లా కార్యవర్గం హాజరై విద్యార్థులకు బహుమతులు, షీల్డ్స్, మెడల్స్‌ని, ఓవరాల్ ఛాంపియన్షిప్ ట్రోఫీలని, ఆక్స్‌ఫర్డ్ హై స్కూల్, స్టార్ వరల్డ్ హై స్కూల్, విజయ్‌హై స్కూల్, వివేకానందహై స్కూల్, రాధాకృష్ణ పాఠశాల ప్రెసిడెన్సి హైస్కూల్‌కు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించిన ట్రస్మాపట్టణ కార్యవర్గాన్ని జిల్లా అసోసియేషన్ సభ్యులను డిఇఓ అభినందించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూట్రిషన్ కమిటీ సభ్యులు, సిడిపివో లు, సూపరింటెండెంట్, సూపర్ వైజర్‌లు, అంగన్వాడీ టీచర్‌లు, పోషణ్ అభియాన్ సిబ్బంది, పాల్గొన్నారు.



టీఎన్జీవో ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోఎస్ భవన్‌లో టిఎన్జీవోఎస్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ సిహెచ్ జార్జ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించి క్రిస్మస్ కే కట్ చేసి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ సిహెచ్ జార్జ్ మాట్లాడుతూ.. కుల మతాలకతీతంగా టీఎన్జీవోఎస్ ఉద్యోగ సంఘంలో మతసామరస్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. టి ఎన్ జి ఓ ఎస్ జిల్లా అధ్యక్షులు సుమన్ మాట్లాడుతూ.. పాస్టర్ జార్జ్, క్రైస్తవ మత పెద్దలను, క్రైస్తవ ఉద్యోగ సోదర, సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, చిట్టి నారాయణ రెడ్డి, కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, అర్బన్ యూనిట్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యులు, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, మాణిక్యం, ప్రకాష్, వివిధ శాఖల ఫోరం అధ్యక్ష కార్యదర్శులు, క్లాస్ ఫోర్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, క్రిస్టియన్ మైనార్టీ ఉద్యోగ సోదర, సోదరీమణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



టీఎన్‌జీవో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రిస్‌మస్ వేడుకలు

పీజీ పరీక్షలను తనిఖీ చేసిన వైస్ ఛాన్సలర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ- ఒకటవ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ మరియు ప్రాక్టికల్) పరీక్షలు ఎంఏ, ఎమ్మెస్ డబ్ల్యూ, ఎం. కాం, ఎంబీఏ, ఎంసీఏ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఏపీఈపిసి హెచ్, ఐఎంబిఏ) (మొదటి సెమిస్టర్ ఎల్ ఎల్ బి) ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్(ఐఎంబిఏ) ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ పరీక్షలను తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరుగుతున్న పీజీ పరీక్షలను తెలంగాణ వర్సిటీ వైస్ ఛాన్సలర్ టి.యాదగిరి రావు ఆకస్మిక తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వైస్ ఛాన్సలర్‌తో అడిషనల్ కంట్రోలర్ బి సాయిలు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.సత్యనారాయణ రెడ్డి ఉన్నారు. శుక్రవారం జరిగిన పరీక్షలకు 151 మంది విద్యార్థులకు 148 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

బిజినెస్

గూగుల్‌లో 10 శాతం ఉన్నతోద్యోగులకు ఎసరు

వాషింగ్టన్ : టెక్ దిగ్గజం గూగుల్‌లో ఉన్నతోద్యోగుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. సంస్థలో పని చేసే మేనేజ్‌మెంట్ స్థాయిల్లోని 10 శాతం ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నట్లు గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ తెలిపారు. డిసెంబర్ 18న జరిగిన జరిగిన ఆల్‌హ్యాండ్స్ సమావేశంలో పిచాయ్ మాట్లాడుతూ.. మేనేజర్, డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ స్థానాలలో ఉద్వాసనలు ఉంటాయని స్పష్టం చేశారు.

కొన్ని స్థానాలు పూర్తిగా తొలగించబడ్డాయన్నారు. మరికొన్ని వ్యక్తిగత కంట్రిబ్యూటర్ పాత్రలుగా మార్పు చేయబడ్డాయన్నారు. ఈ పునరుద్ధరణ రెండు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. పొదుపు చర్యల్లో భాగంగా 2023లోనూ 12,000 మంది ఉద్యోగులను గూగుల్ ఇంటికి పంపించింది. ఓపెన్‌ఎఐ వంటి ఎఐ సంస్థల నుంచి పోటీ పెరుగుతున్న నేపథ్యంలో తన సామర్థ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పిచాయ్ తాజాగా తెలిపారు.

కరుగుతోన్న విదేశీ మారకం నిల్వలు

ముంబయి : భారత విదేశీ మారకం నిల్వలు వరుసగా కరిగిపోతున్నాయి. అమెరికా డాలర్‌కు డిమాండ్ పెరగడం.. రూపాయి విలువ పడిపోవడంతో మారకం నిల్వలపై ఒత్తిడి పెరిగింది. ట్రంప్ ఎన్నిక తర్వాత ఇటీవల పడిపోతున్న రూపాయి విలువ కట్టడికి ఆర్‌బిఐ వద్ద ఉన్న డాలర్లను విడుదల చేస్తోంది. ఈ నేపథ్యంలోనే డిసెంబర్ 13తో ముగిసిన వారానికి ఫారెక్స్ నిల్వలు దాదాపు 2 బిలియన్ డాలర్లు తరిగిపోయి 652.87 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సెప్టెంబర్‌లో ఆల్‌టైం రికార్డ్ 704.89 బిలియన్లుగా ఉన్న ఫారెక్స్ రిజర్వుల నుంచి 52 బిలియన్లు కరిగిపోయాయి. గడిచిన వారంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ స్థాయిలో 85కు పడిపోయింది. స్టాక్ మార్కెట్ల వరుస పతనం... ముఖ్యంగా విదేశీ సంస్థాగత మదుపర్లు తమ ఈక్విటీలను తరలించుకుపోవడమూ మారకం నిల్వలపై ప్రధానంగా ప్రభావం చూపుతోంది.

ఎంటిఎఆర్ టెక్నాలజీకి రూ.226 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ : తమ సంస్థ క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ సెగ్మెంట్‌ల నుంచి రూ.226 కోట్ల విలువ చేసే ఆర్డర్‌లను దక్కించుకుందని ఎంటిఎఆర్ టెక్నాలజీస్ తెలిపింది. ఇందులో బ్లూమ్ ఎనర్జీ నుంచి రూ.191 కోట్లు, రాఫెల్, ఐఎంఐ సిస్టమ్స్, ఐఎఐయ తదితర సంస్థల నుంచి రూ.35 కోట్ల కాంట్రాక్టులను పొందినట్లు శుక్రవారం ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆయా ప్రాజెక్టులన్నిటినీ ఏప్రిల్ 2026 నాటికి పూర్తి చేయనున్నట్లు ఎంటిఎఆర్ ఎండి పర్వత్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. క్లీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల్లో తాము మెరుగైన వృద్ధిని సాధించడానికి విశ్వాసంగా ఉన్నామని.. ఈ రెండు సెగ్మెంట్ లలో మరిన్ని ఆర్డర్లను పొందనున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

తెలుగు రాష్ట్రాల్లో కెవిబి 209 శాఖలకు విస్తరణ

KVB Karur Vysya Bank Smart way to bank

నవ తెలంగాణ -హైదరాబాద్ : ప్రయివేటు రంగంలోని కరూర్ వైశ్యా బ్యాంక్ తెలుగు రాష్ట్రాల్లో 209 శాఖలకు విస్తరించినట్లు ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో అనంతపూర్‌లో, తెలంగాణలోని నిజామాబాద్‌లో కొత్త శాఖలను ఏర్పాటు చేయడం ద్వారా ఈ స్థాయికి చేరినట్లు పేర్కొంది. దీంతో దేశంలో తమ నెట్‌వర్క్ 864 శాఖలకు చేరిందని ఆ బ్యాంక్ వెల్లడించింది. 2024-25లో 26 కొత్త శాఖలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. నూతన శాఖల్లోనూ సేవింగ్ ఖాతాలు, డిపాజిట్లు, పొదుపులు, కరెంట్ ఖాతాలు, లాకర్ సౌకర్యాలతో సహా రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందించనున్నట్లు పేర్కొంది.

ఫీజన్‌తో మైక్రోమ్యాక్స్ భాగస్వామ్యం

- స్టోరేజ్ చిప్‌సెట్స్ తయారీలోకి ప్రవేశం



న్యూఢిల్లీ : దేశీయ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ మైక్రోమాక్స్ తైవాన్‌కు చెందిన స్టోరేజ్ చిప్ కంపెనీ ఫీజన్‌తో భాగస్వామ్యం కుదర్చుకున్నట్లు ప్రకటించింది. ఇరు సంస్థలు మిఫీ పేరుతో సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో కృత్రిమ మేధస్సు (ఎఐ)తో కూడిన స్టోరేజ్ చిప్‌సెట్ మాడ్యూళ్లను రూపొందించడంతో పాటుగా తయారు చేయనున్నట్లు మైక్రోమాక్స్ వెల్లడించింది. కొత్తగా ఏర్పాటు చేసిన కంపెనీలో మైక్రోమ్యాక్స్‌కు 55 శాతం, ఫీజన్‌కు 45 శాతం వాటా ఉంటుందని మైక్రోమాక్స్ వ్యవస్థాపకులు రాహుల్ శర్మ తెలిపారు. ఎస్ఎస్‌డి కంట్రోలర్, ఎస్ఎస్‌డి స్టోరేజ్ టెక్నాలజీలలో ఫీజన్ అగ్రగామిగా ఉంది.

ద్రావిడ్‌తో సిగ్నిఫై రికార్డ్ క్యాంపెయిన్

న్యూఢిల్లీ : అంతర్జాతీయ లైటింగ్ ఉత్పత్తుల కంపెనీ సిగ్నిఫై భారత క్రికెటర్ రాహుల్ ద్రవిడ్‌తో రూపొందించిన 'హమ్ రాతోం మే సూరజ్ ఉగాతే హై' క్యాంపెయిన్‌కు విశేష ఆధారణ లభించినట్లు ఆ కంపెనీ తెలిపింది. డిజిటల్ మార్కెటింగ్‌లో 20 కోట్ల పైగా ప్రశంసలను అందుకున్నట్లు పేర్కొంది. టివి ఛానళ్లు, సోషల్ మీడియాల, బహిరంగ ప్రకటనల్లో గణనీయమైన ప్రభావం చూపిందని సిగ్నిఫై గ్రేటర్ ఇండియా ప్రతినిధి నిఖిల్ గుప్తా తెలిపారు.

రెడ్ రేయాన్‌తో వండర్లా జట్టు

నవ తెలంగాణ -హైదరాబాద్ : అతిపెద్ద అమ్యూజ్‌మెంట్ పార్క్ చెయిన్ అయిన వండర్లా హాలిడేస్ డైనమిక్ యువతరం ప్రాధాన్యతలకు అనుగుణంగా మస్కట్ చిక్కూని ఉత్తేజకరమైన కొత్త అవతార్‌లో ఆవిష్కరించినట్లు తెలిపింది. దీని కోసం ప్రపంచ ప్రఖ్యాత సిజిఐ స్టూడియో రెడ్ రేయాన్ సహకారం అందించినట్లు తెలిపింది. కొచ్చి పార్కులో తొలుత ప్రదర్శించిన ఈ షోకువండర్లా హాలిడేస్ లిమిటెడ్ ఎండి అరుణ్ కె. చిట్టిలపిళ్లి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ధీరన్ చౌదరి, కొచ్చి పార్క్ హెడ్ ఎం.ఎ. రవికుమార్, రెడ్ రేయాన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సాల్వో ఫాలికా హాజరయ్యారు. ఈ చిత్రం బెంగుళూరు, హైదరాబాద్‌లోని వండర్‌లా అమ్యూజ్‌మెంట్ పార్క్‌లలో ప్రదర్శించబడుతుందని ఆ సంస్థ తెలిపింది.

రాష్టంలో టికెఎం గ్రామీణ మహోత్సవ్

నవతెలంగాణ : తమ డీలర్ భాగస్వాములతో కలిసి తెలంగాణ గ్రామీణ మహోత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) తెలిపింది. కస్టమర్ రీచ్, కనెక్షన్‌ని పెంపొందించాలనే తమ నిబద్ధతకు అనుగుణంగా, తమ అధీకృ డీలర్‌ల సహకారంతో దీన్ని నిర్వహిస్తోన్నట్లు వెల్లడించింది. డిసెంబర్ 20 నుండి 22 వరకు మూడు రోజుల పాటు జరుగనున్న ఈ క్యాంపెయిన్‌లో టొయోటా తన సమగ్రమైన ఉత్పత్తులు, సేవలను వినియోగదారులకు చేరువ చేస్తోందని పేర్కొంది. అమ్మకాలు, సర్వీస్ (టొయోటా సర్వీస్ ఎక్స్‌ప్రెస్ ఆఫర్ కార్ సర్వీస్), యూజ్డ్ కార్ సొల్యూషన్‌లు (కార్ ఎక్స్‌ఛేంజ్ ఆఫర్‌లు) వాహనాలతో పాటు రూ.10,000 వరకు ప్రత్యేక స్పాట్ బుకింగ్ ప్రయోజనాలతో కూడిన సమగ్ర అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిందని తెలిపింది. కారు మోడళ్లను బట్టి రూ.98,500 నుంచి రూ.1,38,000 వరకు ప్రయోజనాలు అందిస్తోన్నట్లు పేర్కొంది.

జీతాలకు నిధుల్లేవ్



ఆర్థిక ఇబ్బందుల్లో మున్సిపాల్టీలు

- పట్టణ ప్రగతి నిధులు రాక 20 నెలలు
- పెండింగ్‌లో కాంట్రాక్టర్ల బిల్లులు
- ఆదాయం తక్కువ- ఖర్చు ఎక్కువ
- మున్సిపాల్టీటీ ఆదాయం ప్రభుత్వ ఖాతాలో జమ

నవతెలంగాణ-సూర్యాపేట

రాష్ట్రంలోని మున్సిపాల్టీటీలు తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి చేరుకున్నాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయం వల్ల మున్సిపాల్టీల ఆదాయం ప్రభుత్వ ఖాతాలో జమ అవుతుండటంతో స్థానికంగా జీతాలు చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. అదేవిధంగా అభివృద్ధి కుంటుపడింది. 2019 తర్వాత మున్సిపాల్టీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీని ప్రభుత్వ ఖాతాలో వేసుకుంటోంది. అదేవిధంగా జీఎస్టీ వచ్చాక నిధులు తగ్గాయి. దీంతో మున్సిపాల్టీలకు నేరుగా వచ్చే ఆదాయం ప్రభుత్వ ఖాతాలో జమయ్యాక.. విడుదల చేసే విధానం వచ్చింది. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ఉన్న మున్సిపాల్టీల సంఖ్య కంటే అదనంగా మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాల్టీలుగా చేశారు. అదేవిధంగా పలు గ్రామాలను మున్సిపాల్టీలలో విలీనం చేశారు. పట్టణ ప్రగతి కింద నిధులు మంజూరు చేసేవారు.. అవి కొన్ని నెలలుగా నిలిచిపోయాయి.. అభివృద్ధి కుంటుపడింది.

నిధులు ఇలా..

కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 14వ, 15వ ఆర్థిక సంఘం గ్రాంట్‌లను పట్టణ ప్రగతి గ్రాంట్‌లతో కలిపి ఫిబ్రవరి 2020 నుంచి మున్సిపాల్టీలకు నెలవారీ గ్రాంట్ కింద నిధులు మంజూరు చేస్తూ వచ్చింది. ఈ నిధుల నుంచి డంపింగ్ యార్డ్‌లు, పబ్లిక్ మరుగుదొడ్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫుట్‌పాత్‌లు, నీటి సరఫరా లైన్‌లు, పచ్చదనం పెంపు, శ్మశాన వాటికలు తదితర మౌలిక వసతులు చేపట్టారు. పై పనులు పూర్తి కాగానే జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ల అనుమతితో మున్సిపాల్టీలలో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలు, ఇతర పనులు చేసుకునే అవకాశం ఉండేది. ఇదే విషయమై పురపాలక సంచాలకులుగా గతంలో పనిచేసి రిటైర్మెంటైన ఎన్.సత్యనారాయణ రివ్యూ సమావేశంలో చెప్పారు. దీంతో పలు మున్సిపాల్టీలలో వచ్చిన ఆదాయంతోపాటు రాబోవు ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు పెద్దఎత్తున పనులు చేయించారు. కానీ 20 నెలల నుంచి మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులు మంజూరు కాకపోవడంతో రూ.లక్షల్లో కాంట్రాక్టర్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని మున్సిపాల్టీలలో కరెంట్ బిల్లులు, వీధి దీపాలు మెయింటనెన్స్ చేసే ఈఈఎస్ఎల్ పేమెంట్‌లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాల చెల్లింపులు నిలిచిపోయాయి. పీఎఫ్, ఈఎస్ఐ కూడా చెల్లించని పరిస్థితి నెలకొంది.

అసలు మున్సిపాల్టీ ఆదాయం ఎటు పోతున్నది ?

2018 వరకు కూడా మున్సిపాల్టీలకు ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, స్టాంపు డ్యూటీ (రిజిస్ట్రేషన్‌పై పన్ను) ఎంక్రోచ్‌మెంట్ పన్ను, ఎంటర్‌టైన్‌మెంట్ పన్ను, వాల్యుయేషన్ వేషన్, బర్త్, డెత్ సర్టిఫికెట్స్ జారీ ఫీజు, ఓనర్‌షిప్ సర్టిఫికెట్స్ జారీ ఫీజులు, భవన నిర్మాణం అనుమతి ఫీజులు, లేఅవుట్ ఫీజులు, మడిగెల అద్దెలు, ఖాళీ స్థలాలపై పన్ను విధించి మున్సిపల్ సాధారణ నిధుల కింద ఆదాయం సమకూర్చుకునే వారు. ఈ నిధులకు సరిపడా సిబ్బందిని నియమించుకొని వారికి జీతభత్యాలు, పారిశుధ్య నిర్వహణ మెయింటనెన్స్, మౌలిక వసతులు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించే వారు. కానీ 2019 నుంచి మున్సిపాల్టీలకు రావాల్సిన స్టాంపు డ్యూటీని ప్రభుత్వం ఇవ్వకుండా నేరుగా ప్రభుత్వ అకౌంట్‌లో జమ చేసుకుంటోంది. అదేవిధంగా వాణిజ్య పన్నుల శాఖ నుంచి రావాల్సిన ఆదాయం జీఎస్‌టి వచ్చాక మున్సిపాల్టీలకు రూపాయి కూడా రావడం లేదు. 2019లో రూపొందించిన కొత్త చట్టం వల్ల మున్సిపాల్టీ నుంచి ఎలాంటి ధృవీకరణ పత్రాలు జారీ కావడం లేదు. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్లు నేరుగా మీసేవ అకౌంట్ల ద్వారా ప్రభుత్వ అకౌంట్‌లో జమ అవుతున్నాయి. నేరుగా ఇచ్చే భవన నిర్మాణం అనుమతులను టీఎస్‌బిపాస్ విధానాన్ని ఏర్పాటు చేసి ప్రయివేట్ ఏజెన్సీకి అప్పజెప్పారు. వారి నుంచి మున్సిపాలిటీలకు ఫీజులు సకాలంలో జమ కావడం లేదు. అది కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీఎస్‌బిపాస్ హైదరాబాద్ వారి అకౌంట్‌లో జమైన తర్వాత మెయింటనెన్స్ ఖర్చులు, ట్యాక్స్‌లను మినహాయించుకుని మున్సిపల్ అకౌంట్లలో జమ చేస్తున్నారు.ఔ నేటికీ కొన్ని మున్సిపాల్టీల నుంచి భవన నిర్మాణాలు ఎన్ని ఇచ్చారు? ఎంత ఆదాయం మున్సిపాల్టీలకు పేమెంట్ చేశారన్న దానికి లెక్కాపత్రం లేని పరిస్థితి. అసలు మున్సిపాల్టీలలో ఎన్ని భవనాలకు అనుమతి ఇచ్చారు.. ఎంత ఆదాయం ప్రభుత్వ అకౌంట్లలో జమ అయింది.. మున్సిపాలిటీ అకౌంట్‌లో ఎంత జమ చేస్తున్నారో అనే వాటికి లెక్క లేదు. దీని వల్ల ప్రభుత్వం ఇచ్చే నిధుల మీదనే మున్సిపాల్టీలు ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంటి పన్ను, నల్లా బిల్లుల వసూలులో కూడా ఆశించిన ఆదాయం మున్సిపాల్టీలకు రావడం లేదు.

సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ, హుజుర్ నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో సూర్యాపేట మున్సిపాలిటీలో 20 నెలల నుంచి పట్టణ ప్రగతి నిధులు నిలిచిపోయాయి. నెలకు రూ.46 లక్షల చొప్పున 20 నెలలకు రూ.9 కోట్లా 20 లక్షలు విడుదల కావాల్సి ఉంది. బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్‌లు నేరుగా మీ సేవ అకౌంట్‌ల ద్వారా ప్రభుత్వ అకౌంట్‌లో జమ కావడంతోపాటు, భవన నిర్మాణ అనుమతులను టిఎస్ బిపాస్ విధానంతో ప్రయివేట్ ఏజెన్సీకి అప్పజెప్పడంతో మున్సిపాలిటీలకు ఫీజులు సకాలంలో జమ కావడం లేదు. ఒకప్పుడు సూర్యాపేట మున్సిపాలిటీలో ఉద్యోగులు, సిబ్బంది, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు నెల మొదటి తేదీనే జీతాలు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం సకాలంలో జీతభత్యాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడింది.

నాణ్యత లేని పనులు..

పట్టణాల్లో వివిధ నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు సీసీ, బీటీ రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టుల నిర్మాణంలో నాణ్యత లోపించి వేసిన రోడ్లు ఒకటి రెండేండ్లలోపే గుంతల మయంగా మారి కంకరతేలుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారులు పర్సంటేజీలపై చూపుతున్న శ్రద్ధ పనుల నాణ్యతలో చూపడం లేదనే విమర్శలు ప్రతి మున్సిపాలిటీలోనూ వినిపిస్తున్నాయి.

మున్సిపాల్టీల ప్రధాన ఆదాయం, ఇంటి పన్ను, నల్లాబిల్లుల వసూలు, ఇంటి నెంబర్ జారీలో రెవెన్యూ అధికారుల చేతివాటంతో ఇంటి పన్ను తక్కువ వేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న పరిస్థితి నెలకొంది. ఆన్‌లైన్‌లో ఆశించిన అన్ని గృహాలను నమోదు చేయకుండా ట్యాక్స్‌లను వసూలు చేసి తమ జేబులలో వేసుకుంటున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. రాష్టంలోని చాలా మున్సిపాల్టీలలో అకౌంట్స్ విభాగంలో చైర్మెన్, కమిషనర్ల ఒత్తిళ్లతో ఫైల్స్ లేకున్నా చెక్కులు డ్రా చేసుకుంటున్నారు. ఇవన్నీ అడిట్‌లో కనిపించకుండా మ్యానేజ్ చేస్తూ ఆదాయానికి గండికొడుతున్నారు.

ప్రభుత్వం వెంటనే రూ.9.20 కోట్లు విడుదల చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రగతికి సంబంధించిన నిధులు రూ.9.20 కోట్లు విడుదల చేయకపోవడంతో సూర్యాపేట మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడింది. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జీతభత్యాలకు ఇబ్బందిగా మారింది. అదేవిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపి వేయడంతోపాటు కొత్తగా నిధులు మంజూరు చేయకపోవడంతో సంవత్సరం నుంచి అభివృద్ధి నిలిచిపోయింది.

మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ


పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల అలసత్వం, సరిపడా సిబ్బంది లేకపోవడం ఇబ్బందులకు దారి తీస్తోంది. ఇందులోనే ఉన్న సిబ్బంది తోనే ప్రజాప్రతినిధులు, అధికారులకు సంబంధించిన పనులు చేయిస్తున్నారు. దీంతో సిబ్బంది తక్కువై పారిశుధ్యం పడకేస్తోంది.

ఇదిగాక జిల్లా స్థాయిలో ఉన్న అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలలో వివిధ కార్యక్రమాలకు మున్సిపల్ సిబ్బందితో పనులు చేయిస్తున్నారు. వార్డులు పెరిగినా సరైన సిబ్బంది లేకపోవడం వల్ల కూడా పనులు చేయించలేని దుస్థితి నెలకొంది.

ఆరేండ్లు.. ఆరు విడతలు


- అమరావతికి ప్రపంచబ్యాంకు రుణం
- తొలి విడతగా రు. 348 కోట్లు
- ఆరునెలలకోసారి క్షేత్రస్థాయి తనిఖీలు
- అవసరమైతే ఎప్పుడైనా పనుల పరిశీలన



అమరావతి: రాజధాని అమరావతి నగర నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు ఇస్తున్న 800 మిలియన్ డాలర్ల రుణాన్ని ఆరు విడతల్లో ఆరు సంవత్సరాలపాటు ఇవ్వనుంది. ఈ మేరకు సిఆర్‌డిఎతో కుదుర్చుకున్న ఒప్పంద వివరాలను తాజాగా విడుదల చేసిన నివేదికలో ప్రపంచబ్యాంకు పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం తొలివిడతగా 348 కోట్ల రూపాయలు (41 మిలియన్ డాలర్లు)ను ప్రపంచబ్యాంకు విడుదల చేయనుంది. 2025 జనవరి నెలలో ఈ మొత్తం విడుదల కానున్నట్లు సిఆర్‌డిఎ వర్గాలు తెలిపాయి. నిధులు విడుదల ప్రారంభమైన తరువాత ప్రతి ఆరు నెలలకోసారి ప్రపంచబ్యాంకు బృందం క్షేత్రస్థాయిలో పనులను తనిఖీ చేస్తుంది. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయో లేదో పరిశీలిస్తుంది. అవసరమని భావిస్తే ప్రపంచబ్యాంకు బృందం ఎప్పుడైనా క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించే అవకాశం ఉందని నివేదికలో పేర్కొన్నారు. తొలి విడత నిధుల ఖర్చుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలన నివేదికతో పాటు కన్సల్టెన్సీ నివేదిక, ఆడిట్ రిపోర్టులను పరిశీలించిన అనంతరం సంతృప్తి చెందితేనే మలి విడత నిధులు విడుదల చేయనున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2026లో 849కోట్ల రూపాయలు(100 మిలియన్ డాలర్లు), 2027లో 1,121కోట్లు (132 మిలియన్ డాలర్లు) 2028లో 185 మిలియన్ డాలర్లు, 2029లో 218 మిలియన్ డాలర్లు, 2030లో 123 మిలియన్ డాలర్లను ప్రపంచబ్యాంకు విడుదల చేయనుంది. ప్రతి ఏటా డిసెంబరు 31వ తేదీన నివేదికలు కచ్చితంగా బ్యాంకు ప్రతినిధులకుగానీ, లేదా వారి కోసం నియమించిన కన్సల్టెన్సీలకు గానీ అప్పగించాల్సి ఉంటుందని తెలిపారు. తాజా ఒప్పందాన్ని ఎట్టి పరిస్థితుల్లో రద్దు చేసుకోవడంగానీ, మార్చుకోవడంగాని జరగదని నిబంధనల్లో పేర్కొన్నారు. రాజధాని నిర్మాణానికి మొత్తం ఆపరేషనల్ కాస్ట్ 1784 మిలియన్ డాలర్లు అవుతుందని అంచనా వేశారు. దీనిలో ప్రపంచబ్యాంకు 800 మిలియన్ డాలర్లు, ప్రపంచబ్యాంకేతర గ్రూప్ 800 మిలియన్ డాలర్లు ప్రభుత్వం 184 మిలియన్ డాలర్లు సమకూర్చనున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ నిధులను అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎడిసిఎల్) ద్వారా ఖర్చు చేయనున్నారు. పర్యవేక్షణ కూడా ఈ సంస్థే చేయనుంది.

సహకార రుణాలకూ ఇకెవైసి ?

- సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు !




అమరావతి : ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్)లో రుణాలు (బెనిఫిషీయర్స్) తీసుకున్న లబ్ధిదారులకు ఇకెవైసిని ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది. దీనికి సంబంధించి ఇప్పటికే ఎంప్లాయి మొబైల్ అప్లికేషన్ యాప్‌ను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఇకెవైసి మ్యాన్యువల్‌ను ఎప్పటి నుంచి అమల్లోకి తేవాలనే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనుందని తెలిసింది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకే ఈ బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ప్రభుత్వం నుంచిఆదేశాలు అందిన వెంటనే సచివాలయ ఉద్యోగులు ఇకెవైసి మొబైల్ యాప్‌లో నమోదుచేసే ప్రక్రియను ప్రారంభిస్తారని చెబుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50లక్షల మంది వరకు మ్యాపింగ్ కాక మిస్సింగ్ కింద ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అటువంటి వారినందరినీ ప్రభుత్వం హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేయడంతో పాటు జియో ట్యాగింగ్ చేయాలని ఇప్పటికే గ్రామ ,వార్డు సచివాలయాల శాఖ ఆదేశించింది. తాజాగా సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న లబ్ధిదారులను ఇకెవైసి చేయడం ద్వారా ఆయా రైతులు ఏయే బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు? సంబంధిత రైతుకు ఎంత విస్తీర్ణం భూమి ఉంది? ఆయా రైతులు బిపిఎల్‌కు లోబడి ఉన్నారా? అంతకంటే ఆదాయం మించి ఉన్నారా? అనే అంశాలు కూడా తెలుస్తాయని చెబుతున్నారు.

ధాన్యం సేకరణలో పొరపాట్లు సహించం

రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఏపీ సీఎం చంద్రబాబు

- పంటల నిల్వకు సెలోన్ సిస్టం తెస్తాం
- ఆర్ఎస్‌కె, రైస్ మిల్లుల పరిశీలన
- రెవిన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణ



విజయవాడ : ధాన్యంసేకరణలో పొరపాట్లను సహించబోనని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను హెచ్చరించారు. 'రైతు సేవా కేంద్రానికి ఇప్పుడు చెప్పి తనిఖీకి వచ్చాను, ఇకపై చెప్పకుండా తరచూ తనిఖీలు చేపడతాను' అని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ధాన్యాన్ని మిల్లులకు తోలిన రైతులకు రెండు, మూడు గంటల్లోపు నగదును వారి ఖాతాల్లో జమ చేయడానికి ప్రయత్నిస్తామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతామని చెప్పారు. రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో చంద్రబాబు శుక్రవారం పర్యటించారు. గంగూరులో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ధాన్యం విక్రయించిన రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వెంకటాద్రి రైస్ మిల్లును పరిశీలించారు. రైతు సేవా కేంద్రం, రైస్ మిల్లులోని రెండు మాయిశ్చర్ మిషన్ల మధ్య 0.4 తేమ శాతం వ్యత్యాసాన్ని గుర్తించారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద మీడియాతో చంద్రబాబు మాట్లాడుతూ దళారుల జోక్యం లేకుండా చేయడానికి రైతు సేవా కేంద్రాల ద్వారా ఎకరాకు 40 సంచుల ధాన్యం కొనాలనే నిబంధన పెట్టామన్నారు. క్షేత్రస్థాయిలో ఇంతకన్నా ఎక్కువ పండించినా రైతుల నుంచి కొనుగోలు చేయాలని పౌర సరఫరాల కమిషనర్ వీరపాండ్యన్‌కు సూచించారు. బుడమేరు ముంపునకు గురైన పొలాల్లో పండిన ధాన్యాన్ని ఆర్ఎస్‌కెల్లో కొనడం లేదని మీడియా ప్రతినిధులు చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా కలెక్టర్ బాలాజీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిహారం ఇచ్చిన భూముల్లో ధాన్యం సేకరించడం లేదని చెప్పడంతో, ఆ భూముల్లో ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం అమ్మిన రైతులకు నెలల తరబడి నగదు అందక అవస్థలు పడ్డారన్నారు. ప్రస్తుత సీజన్లో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం అమ్మిన రైతుల ఖాతాల్లో 24 గంటలల్లోపు నగదు జమ చేస్తున్నామని, ఇప్పటి వరకు 3,20,703 మంది రైతుల నుంచి 21,04,233 టన్నుల ధాన్యం సేకరించి 93 శాతం మంది రైతుల ఖాతాల్లో 24 గంటల్లోపు రూ.4,730 కోట్లు జమ చేశామని తెలిపారు. తేమ శాతంలో వ్యత్యాసం సమస్యను పరిష్కారిస్తామన్నారు. యంత్రాలతో నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు డ్రయర్ రైస్ మిల్లులు 23 శాతం మాత్రమే ఉన్నాయని, రాబోయే రోజుల్లో డ్రయర్లను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండించిన పంటలను నిల్వ చేసుకుని అమ్ముకునేందుకు అవకాశం కల్పించడానికి సెలోన్ సిస్టం రైతులకు అందుబాటులో తీసుకొస్తామన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం తప్పుల్లేకుండా రీ సర్వే

22ఎ జాబితాలో చేరిన భూములతోపాటు ఇతర భూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని చంద్రబాబు తెలిపారు. కంకిపాడు మండలం ఈడుపుగల్లులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 1-బి రిజిస్టర్‌తోపాటు 22 జాబితాలను పారదర్శకంగా ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం భూకబ్జాతో మొదలు పెట్టి వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని విమర్శించారు. 16,816 గ్రామాలకుగాను 6,698 గ్రామాల్లో తప్పుడు రీ సర్వే నిర్వహించడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లోనే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశామన్నారు. ప్రజల ఆస్తికి రక్షణ కల్పించేలా, కబ్జాలు, ఆక్రమణలకు అవకాశం లేకుండా ల్యాండ్ గ్రాబింగ్ యాక్టును తీసుకొచ్చామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుల్లో ఇప్పటి వరకు 2,79,148 మంది ఫిర్యాదులు చేశారని తెలిపారు. తప్పులకు ఆస్కారం లేకుండా భూముల రీ సర్వే నిర్వహించి రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు అందిస్తామన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ద్వారా అందుతున్న ఫిర్యాదుల్లో 65 శాతం రెవెన్యూ అంశాలపైనే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు నాదెళ్ల మనోహర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా మంత్రి కొల్లు రవీంద్ర, పలువురు ఎంఎల్ఎలు, అధికారులు పాల్గొన్నారు.